ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 11 మే 2025



లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

రాజంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం భువనగిరిపల్లెలోని లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను శనివారం వైభవంగా ప్రారంభించారు. బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు స్వామి వారికి వేకువజాము నుంచే వేదపండితులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో కొలువుదీర్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మొదటిరోజు శనివారం కావడంతో ఉత్సవాలకు రాజంపేట చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీగా భక్తులు హాజరయ్యారు. స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ ఆధ్వర్యంలో తీర్థ, అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మొదటిరోజు ఉభయదారులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



గర్వంగా ఉంది..

- ఉగ్రవాదాన్ని పూర్తిగా అణచివేయాలి
- పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పాలి
- సైనిక కుటుంబసభ్యుల మనోగతం
- దేశ సేవలో పల్లె సీమ పౌరుషం

● భారత్-పాక్ సరిహద్దులో ములకలచెరువు సైనికులు

పాకిస్థాన్ ఉగ్రవాదులు పహల్గాంలో అమాయకుల ప్రాణాలు పొట్టనబెట్టుకున్నారు. ఆ ఘటన యావత్ భారత్‌ను కంటతడి పెట్టించింది. ఆడపడుచుల పసుపు, కుంకుమను చెరిపేసిన ఉగ్రవాదులపై మనోళ్లు ప్రతీకారం తీర్చుకున్నారు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై మన సైనికులు విరుచుకుపడ్డారు. ఈ క్రమంలో భారత్-పాక్‌ల మధ్య సరిహద్దులో భీకర పోరు జరుగుతోంది. పాకిస్థాన్‌తో మన సైనికులు వీరోచితంగా పోరాడుతున్నారు. పాక్ డ్రోన్లు, యుద్ధ విమానాలను మన సైనికులు ఎక్కడికక్కడ నాశనం చేస్తున్నారు. ఈ యుద్ధంలో మా వాళ్లు పాలుపంచుకోవడం ఎంతో గర్వంగా ఉంది... అలాగే భయంగా కూడా ఉందని, దేశ సరిహద్దులో శత్రు దేశంతో మా వాళ్లు చేస్తున్న పోరాటం ఎంతో ఆత్మస్థైర్యాన్ని నింపుతోందని చెబుతున్నారు ములకలచెరువుకు చెందిన సైనికుల కుటుంబసభ్యులు.

ములకలచెరువు, మే 10 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండలం పర్తికోట పంచాయతీ పేయలవానిపెంటకు చెందిన ఆడపాల వెంకటరమణ, శంకరమ్మలకు కుమారుడు మహేశ్, కుమార్తె రాధికలు సంతానం. తండ్రి వెంకటరమణ చిన్నతనంలోనే మృతి చెందడంతో తల్లి శంకరమ్మ కూలీ పనులకు వెళ్లి ఇద్దరు బిడ్డలను పోషించి చదివించింది. ఈ క్రమంలో మహేశ్ పదో తరగతి పూర్తి చేసి ఆర్మీకి సెలెక్ట్ అయ్యాడు. తమిళనాడు రాష్ట్రం చెన్నైలో శిక్షణ పూర్తి చేసుకుని 2000 సంవత్సరంలో ఆర్మీలో చేరాడు. ప్రస్తుతం భారత్-పాక్ సరిహద్దులోని యూరి సెక్టార్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ప్రస్తుతం రెండు రోజులుగా పాకిస్థాన్ డ్రోన్లు, యుద్ధ విమానాలతో దాడి చేస్తుండడం, సరిహద్దులో భారత్-పాక్ సైనికుల మధ్య కాల్పులు జరుగుతుండడంతో అక్కడ విధులు నిర్వర్తిస్తున్నాడు. అలాగే నీరుగట్టువారిపల్లెకు చెందిన శ్రీరాములు, లక్ష్మీదేవమ్మల కుమారుడు మహేశ్ కూడా భారత్-పాక్ సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్నాడు. వేపూరికోట పంచాయతీ ఎర్రకాలువపల్లెకు చెందిన పిడుగు వెంకటరమణ, నాగరాణి కుమారుడు కిరణ్‌కుమార్ ప్రస్తుతం సైనికుడిగా భారత్-పాక్ సరిహద్దులో ఉన్న రాజస్థాన్ రాష్ట్రం సూరత్ ఘాట్‌లో విధుల్లో ఉన్నాడు. ఇలా ములకలచెరువు మండలానికి చెందిన పలువురు సైనికులుగా పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో పాలుపంచుకుంటున్నారు.

దేశ సేవలో...పల్లె పౌరుషం

దేశ సేవలో పల్లె పౌరుషాన్ని చూపుతున్నారు. ములకలచెరువు మండలం మారుమూల ప్రాంతంలోని పేయలవానిపల్లె, నీరుగట్టువారిపల్లె, ఎర్రకాలువపల్లె, కుటాగుళ్లపల్లెకు తదితర గ్రామాలకు చెందిన యువకులు ఆర్మీలో చేరారు. పెద్దలు జైకిసాన్ అంటే వారి పిల్లలు జైజవాన్ అని అంటున్నారు. దేశ రక్షణే తమ లక్ష్యంగా యువకులు సైన్యంలో చేరి సేవలందిస్తున్నారు. పల్లె పౌరుషాన్ని దేశ సరిహద్దులో పాకిస్థాన్ మీద చూపుతున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పలువురు యువకులు ఆర్మీలో విధులు నిర్వర్తిస్తున్నారు.

మాకెంతో గర్వంగా ఉంది



కిరణ్‌కుమార్ కుటుంబ సభ్యులు

మా కుమారుడు కిరణ్‌కుమార్ ఆర్మీలో పనిచేస్తున్నాడు. పదేళ్లుగా జవానుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. మాకు ఇద్దరు పిల్లలు. కుమారుడు కిరణ్‌కుమార్, కుమార్తె జ్యోతి. మా వాడు ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయడం, దేశ రక్షణలో పాలు పంచుకోవడం చాలా గర్వంగా ఉంది. ఇప్పుడు జరుగుతున్న యుద్ధం వల్ల కొంత భయంగా ఉంది. అలాగే ఎంతో గర్వపడుతున్నాం. ప్రస్తుతం మా వాడు భారత్-పాక్ సరిహద్దులోని రాజస్థాన్ రాష్ట్రం సూరత్ ఘాట్‌లో విధుల్లో ఉన్నాడు. రాజస్థాన్ సరిహద్దులో పాకిస్థాన్ డ్రోన్లతో దాడులు చేస్తోంది. దానిని మన వాళ్లు తిప్పికొడుతూ డ్రోన్లను కూల్చేస్తున్నారు.

- పిడుగు వెంకటరమణ, నాగరాణి, ఎర్రకాలువపల్లె, ములకలచెరువు

పట్టుబట్టి ఆర్మీలో చేరాడు



మాది నిరుపేద కుటుంబం. నా భర్త వెంకటరమణ పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే మృతి చెందారు. కూలి పనులకు వెళ్లి కుమారుడు మహేశ్, కుమార్తె రాధికలను చదివించాను. నా కుమారుడు మహేశ్ నన్ను ఒప్పించి ఆర్మీలో చేరాడు. ఆర్మీలో జవానుగా సెలక్ట్ అయ్యి ట్రైనింగ్ పూర్తి చేసుకుని 2000 సంవత్సరంలో సైనికుడిగా విధుల్లో చేరాడు. రెండు నెలల క్రితం ఇంటికి వచ్చి వెళ్లాడు. ప్రస్తుతం పాకిస్థాన్‌తో యుద్ధం జరుగుతుండడం, ఇందులో నా కుమారుడు మహేశ్ పాల్గొనడం భయంగా ఉంది కానీ గర్వంగా ఉంది. ప్రస్తుతం మా వాడు కశ్మీర్‌లోని యూరీ సెక్టారులో ఉన్నాడు.

- అడపాల శంకరమ్మ, పేయలవానిపెంట, ములకలచెరువు

జడ్పీ మాజీ చైర్మన్ సీఎం బలరామిరెడ్డి కన్నుమూత



సీఎం బలరామిరెడ్డి (ఫైల్‌ఫొటో)

కొండాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సీఎం బలరామిరెడ్డి (90) శనివారం తెల్లవారుజామున చెన్నైలో మృతి చెందారు. కొండాపురం గ్రామానికి చెందిన ఈయన సినీనటుడు రాజ్‌కుమార్‌కు బిడ్డనిచ్చిన మామ. మాజీ ఎమ్మెల్యే సీఎం రామనాథరెడ్డికి అన్న. ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య మూడేళ్ల కిందట మృతి చెందగా, కుమారుడు రవీంద్రనాథరెడ్డి ఆరు నెలల కిందట మృతి చెందారు. కొంతకాలంగా ఈయన చెన్నైలో అల్లుడు రాజ్‌కుమార్ ఇంటిలో ఉంటున్నారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన భౌతిక కాయానికి కొండాపురంలో అంత్యక్రియలు జరగనున్నాయి.

టీచర్ నుంచి జడ్పీ చైర్మన్ దాకా..

కొండాపురం ప్రాంతంలో సీఎం బలరామిరెడ్డి అంటే నైతిక విలువలు కలిగిన వ్యక్తిగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఉపాధ్యాయుడుగా, హెడ్మాస్టర్‌గా కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు, టి.కోడూరు హైస్కూళ్లతో పాటు పలుచోట్ల పనిచేశారు. 1981వ సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ముద్దనూరు సమితి ప్రెసిడెంట్‌గా గెలుపొంది జడ్పీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1984లో టీడీపీలో చేరారు. 1987లో టీడీపీ తరపున జడ్పీ చైర్మన్‌గా ప్రత్యక్ష ఎన్నికలలో కందుల శివానందరెడ్డిపై గెలుపొంది జడ్పీ చైర్మన్‌గా 1995 వరకు కొనసాగారు. ఆ తర్వాత ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనూ ఆయనకు సాన్నిహిత్యం ఉంది.

తంబళ్లపల్లెపై చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ

- రికార్డు స్థాయిలో 30 మందికి రూ.40 లక్షలు సీఎం సహాయనిధి
- తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మే 10 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం తంబళపల్లె నియోజకవర్గంలోని 30 మంది లబ్ధిదారులకు రూ.40 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రికార్డు స్థాయిలో ఒకేసారి 30 మందికి రూ.40 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను విడుదల చేశారన్నారు. అనారోగ్యంతో చికిత్సల కోసం ఖర్చు చేసుకున్న పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ విడుదలైందన్నారు. ఎన్నికల సమయంలో కురబలకోట మండలం అంగళ్లులో జరిగిన సభలో మాట్లాడిన చంద్రబాబు తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని ప్రత్యేక చొరవ తీసుకుని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని చెప్పారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తంబళ్లపల్లెపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. ఇందులో భాగంగానే ఎక్కడా లేని విధంగా ఒకేసారి 30 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ విడుదల చేశారన్నారు. అంతకు మునుపు స్థానిక పశువైద్యశాలలో పాడి రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న పశువుల దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీ-నీవా జలాలను నియోజకవర్గంలోని 39 చెరువులకు అనుసంధానం చేసి కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నల్లగంగమ్మ.. చల్లంగ చూడమ్మా... 6





6 కమిటీ చిన్నది.. ఆదాయం పెద్దది... ఆదాయంలో దూసుకెళ్తున్న ములకలచెరువు మార్కెట్ కమిటీ

పంట పొలాలపై ఏనుగుల దాడి

- అటవీ సరిహద్దు ప్రాంత రైతుల ఆందోళన
- జిల్లెళ్లమంద పంచాయతీలో ఐదు ఏనుగుల గుంపు సంచారం
- అటవీ అధికారుల పరిశీలన

పీలేరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలపై శనివారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు దాడి చేయడంతో అటవీ సరిహద్దు గ్రామాల రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవీ పల్లె మండలం జిల్లెళ్లమంద పంచాయతీ పరిధిలోని బసన్నగారిపల్లెకు చెందిన బుజ్జయ్య మామిడి తోటలోకి ఐదు ఏనుగులు వచ్చాయి. ఓ రైతుకు చెందిన వరి పైరును తొక్కుకుంటూ వెళ్లాయి. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు వస్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ సరిహద్దు గ్రామాల రైతులు వివిధ రకాల పంటలు సాగు చేశారు. అలాగే ఎక్కువగా మామిడి తోటలు ఉన్నాయి. మామిడి పంట చేతికందే సమయంలో ఏనుగులు తోటలపై పడి ధ్వంసం చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. భాకరాపేటకు చెందిన ఫారెస్ట్ అధికారులు బసన్నగారిపల్లె పరిసర ప్రాంతాలలో ఏనుగుల పాదముద్రలు గుర్తించి ఐదు ఏనుగులు ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రెండు చిన్నవి, మూడు పెద్ద ఏనుగులు ఉన్నట్లు తెలిపారు. భాకరాపేట అటవీ ప్రాంతం నుంచి ఇటువైపు రెండు ఏనుగులు వచ్చాయని, అయితే మిగిలినవి ఎక్కడి నుంచి వచ్చాయో గుర్తించాల్సి ఉందని చెప్పారు. రాత్రి వేళల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంట పొలాలు పైకి రాకుండా అటవీ ప్రాంతంలోకి ఏనుగులను మళ్లించడం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాత్రి వేళల్లో అటవీ సరిహద్దు గ్రామాల రైతులు పొలం వద్దకు వెళ్లాంటే భయపడుతున్నారు.



శేషాచలం అటవీ ప్రాంతంలో ఏనుగులు



బసన్నగారిపల్లె సమీపంలో వరి పైరు తొక్కుకుంటూ వెళ్లిన ఏనుగులు



బసన్నగారిపల్లె సమీపంలో ఏనుగుల పాద ముద్రలు గుర్తించిన ఫారెస్ట్ అధికారులు

కబ్జాకు కేరాఫ్ కొమ్మనవారిపల్లె

- ప్రభుత్వ భూమిలో మొక్కలు నాటిన చోటా నాయకుడు
- నాయకుడి పొలానికి ఉపాధి కూలీల చేత పనులు
- కబ్జా చేసిన వారిలో ఫీల్డ్, డిజిటల్ అసిస్టెంట్‌లు



సర్వే నెంబరు-846లో ఓ నాయకుడు ప్రభుత్వ భూమిని ఆక్రమించి వేసిన కంచె



ప్రభుత్వ భూమిని డిజిటల్ అసిస్టెంట్ ఆక్రమించి వేసిన కంచె

పుల్లంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి) : భూకబ్జాలకు అడ్డా పుల్లంపేట. ఏ పంచాయతీలో చూసినా భూకబ్జాలే. పుల్లంపేట మండలంలో సుమారు 15 వేల ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని గతంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి నివేదిక కూడా పంపారు. అంత స్థాయిలో జరగడానికి కారణం రెవెన్యూ అధికారులే అన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో పనిచేసిన, ఇప్పుడు పనిచేస్తున్న రెవెన్యూ అధికారుల చర్యలతోనే ప్రభుత్వ భూములు మాయమవుతున్నాయన్న విమర్శలున్నాయి. పుల్లంపేట మండలంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములను ఏకంగా ఆన్‌లైన్ చేసిన సంఘటనలు అన్నీ ఇన్నీ కావు. వందలాది ఎకరాలను ఆన్‌లైన్ చేసి కోట్లు దండుకున్నారని బహిరంగంగానే ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని కొమ్మనవారిపల్లె రెవెన్యూ గ్రామంలో ప్రభుత్వ భూములు అధికంగా ఉన్నాయి. రెవెన్యూ గ్రామంలో ప్రభుత్వం డీకేటీ పట్టాలు ఇచ్చిన వాటి కంటే కబ్జా చేసిన భూములే అధికంగా ఉన్నాయి. ఇక్కడ గత ప్రభుత్వంలో వైసీపీ చోటా నాయకులు కబ్జాలకు పాల్పడ్డారు. ప్రస్తుతం ఇది నా అడ్డా అంటూ ఓ టీడీపీ చోటా నాయకుడు దందా సాగిస్తున్నాడు. సర్వే నెంబరు-846లో ఉన్న ప్రభుత్వ భూమిని చోటా నాయకుడు కబ్జా చేసి మొక్కలు నాటాడు. ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి మొక్కలు తొలగించేశారు. వారం తిరగక ముందే అదే పొలంలో చుట్టూ కంచె వేసి ఐదెకరాలకు పైగా కబ్జా చేసి వెంటనే మొక్కలు నాటారు. పొలంలో బోర్లు వేశారు. నీరు పడకపోవడంతో మరోచోట బోరు వేసి సుమారు పైపులైన్లు వేసేందుకు కిలోమీటరు మేర గాడి తీశారు. ఈ గాడిని పూడ్చేందుకు రెండు రోజులుగా ఏకంగా ఉపాధి కూలీలనే వినియోగించారు. కూలీలకు మాత్రం తాను అధికారుల చేత అనుమతి తీసుకున్నానని చెప్పినట్లు తెలిసింది. దీంతో కూలీలు కూడా పని పూర్తి చేశారు. వైసీపీ సానుభూతి మహిళా సర్పంచ్ కుమారుడు ఇక్కడ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఫీల్డ్ అసిస్టెంట్ అయిన అతను ప్రభుత్వ భూమిని సుమారు 10 ఎకరాలకు వరకు కబ్జా చేసి కంచె వేశాడు. గతంలో ఫీల్డ్ అసిస్టెంట్‌కు, టీడీపీ నాయకుల మధ్య పచ్చగడ్డ వేస్తే భగ్గుమనేది. ప్రస్తుతం రాజీ కుదుర్చుకుని సొంత పనులకు ఉపాధి కూలీలను వినియోగిస్తున్నారని స్థానికులు అంటున్నారు. రంగంపల్లె పంచాయతీలో పనిచేసే వల్లూరుపల్లె గ్రామానికి చెందిన డిజిటల్ అసిస్టెంట్ కూడా ప్రభుత్వ భూమిని కబ్జా చేశాడు. నెల క్రితం మొక్కలు నాటి చుట్టూ కంచె వేశాడు. ఇక్కడ కబ్జాదారులు గుట్టలను కూడా వదలకుండా తమ స్వాధీనంలో ఉంచుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇష్టానుసారంగా కబ్జా చేసి కంచె వేస్తున్నా అప్పట్లో రెవెన్యూ అధికారులు అటువైపు కూడా చూడలేదు. ప్రస్తుతం అధికారులు మారినా, ప్రభుత్వం మారినా కబ్జాలు మాత్రం ఆగడం లేదు. ప్రస్తుతం ఈ పంచాయతీలో అధికార, ప్రతిపక్ష చోటా నాయకులు కలిసిపోవడంతో ఆక్రమణలకు అడ్డూ అదుపు లేకుండాపోతోందన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ భూములు కాపాడాల్సిన అధికారులే కబ్జాదారులను కార్యాలయంలో కూర్చోబెట్టుకుని మర్యాదలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ అరవిందకిషోర్‌ను వివరణ కోరగా తాను కాన్ఫరెన్స్‌లో ఉన్నానని, వివరాలు మెసేజ్‌లో పెట్టాలని సూచించారు. కబ్జా భూమిలో ఉపాధి కూలీల చేత పనులు చేయిస్తున్న విషయమై ఏపీవో శ్రీనివాసులును వివరణ కోరగా ఈ విషయంపై విచారణ చేపట్టి బాధితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఫీల్డ్ అసిస్టెంట్ ఆక్రమించి కంచె వేసిన ప్రభుత్వ భూమి



చోటా నాయకుడి పొలానికి పైపులైను పూడ్చుతున్న ఉపాధి కూలీలు

నల్లగంగమ్మ.. చల్లంగ చూడమ్మా...

● అత్యంత మహిమ గల దేవరాయి ● ముస్తాబవుతున్న నల్లగంగమ్మ ఆలయం ● రేపు మొలకల పౌర్ణమి నాడు ఘనంగా అమ్మవారి జాతర

సంబేపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె దేవరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఈనెల 12వ తేదీ మొలకలపౌర్ణమి సందర్భంగా జాతర వైభవంగా జరగనుంది. ఆలయంలోని దేవరాయి **ఎంతో మహిమ గలదని ప్రజలు రకరకాలుగా చెబుతుంటారు.** దీర్ఘకాలంగా వివిధ రోగాలతో బాధపడుతున్న భక్తులు ఈ రాయిపై పొర్లు దండాలు పెడితే అవి నయమవుతాయని భక్తుల విశ్వాసం. ఆలయ చరిత్రను పరిశీలిస్తే.. పూర్వంలో ఓ బండరాయి సంబేపల్లె గ్రామం సమీపంలో నాలుగు కొండల మధ్య దట్టమైన ముళ్లపొదల్లో ఉండేది. ఓ మేకల కాపరి మేకలు మేపుకుంటుండగా ఆ రాయిపై కాలు పెట్టిన ఓ కుంటిమేకకు కాలు బాగవడంతో ఆ కాపరి గ్రామస్తులకు ఈ విషయాన్ని చెప్పాడు.

అంతే గ్రామస్తులు ముళ్లపొదల్లో వెతికి చూడగా ఆ బండపై తెలియని భాషలో అక్షరాలు, ముగ్గులు ఉండటంతో జనం ఆనాటి నుంచి ఆ రాతికి పూజలు చేయడం ప్రారంభించారు. తీర్థయాత్రలకు వెళుతున్న ఓ మహాముని చూసి ఇది శక్తివంతమైన దేవరాయిగా గుర్తించి ఆ బండ రాతికి ఎదురుగా నల్లగంగమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించి వెళ్లారు. చిన్నగుడిగా ఉన్న ఈ ఆలయాన్ని 2005లో రాయచోటి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త మునగా మురళీ స్వామి అమ్మవారి ఆశీస్సులతో ఆలయ నిర్మాణం చేశారు.

శక్తి ప్రదాయిని నల్లగంగమ్మ తల్లి

ఈ ఆలయం చుట్టూ కొండలు. ఆ కొండల మధ్య సువిశాలమైన ప్రాంతంలో నల్లగంగమ్మ ఆలయం నిర్మించారు. ఈ ఆలయానికి తూర్పున కదిరిదేవుని కొండ, పడమర దుర్గం కొండ, ఉత్తరాన వెదుర్గ కొండ, దక్షిణాన ముగదాల కొండ మధ్యన వెలిసిన నల్లగంగమ్మ తల్లి భక్తుల కోర్కెలు తీర్చే అమ్మగా పిలవబడుతోంది. కర్ణాటక, చిత్తూరు, కడప తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం విశేషం. ఇక్కడ సినిమా హీరో శరత్‌కుమార్ తమిళ చిత్రం షూటింగ్ కూడా జరిగింది.



ప్రత్యేక అలంకరణలో నల్లగంగమ్మ తల్లి, మహిమ గల దేవరాయి

గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి రూ.1.18 కోట్లతో 2022లో మహా మండపం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పనులు పూర్తి కావడంతో సర్వాంగ సుందరంగా ఆలయం తయారైంది. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఆలయం చుట్టూ రూ.ఒక కోటి నిధులతో సిమెంటు రోడ్లు వేశారు.

12న అమ్మవారి జాతర

ఈనెల 12వ తేదీన మొలకలపౌర్ణమి సందర్భంగా అమ్మవారి జాతర కనులపండువగా జరుగుతుంది. చిత్తూరు, తిరుపతి, కడప, అనంతపురం ప్రాంతాల నుంచి ప్రజలు అమ్మవారి జాతరలో పెద్దఎత్తున పాల్గొంటారు. రాత్రి భక్తుల కోసం జబర్దస్త్ యాక్టర్లచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనంతరం అమ్మవారికి మొక్కుబడి కోసం కట్టిన చాందినీ బండ్లను ఆలయం చుట్టూ తిప్పి 13వ తేదీ అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కుబడులు చెల్లిస్తారు.



గతంలో ఇక్కడ ఉన్న పురాతన ఆలయం, ఆలయాన్ని నూతనంగా నిర్మించిన మునగా మురళీస్వామి

చింత తీర్చే చిగురు!



చింత చిగురును కొనుగోలు చేస్తున్న మహిళ

పీలేరు, మే 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మాత్రమే దొరికే ఆహార పదార్థాల్లో మామిడి, తాటి ముంజల తరువాత చింత చిగురు కూడా ఒకటి. వేసవి వచ్చిందంటే గ్రామాలలో చిన్నపిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు చింత చెట్ల చుట్టూ చేరి చిగురు సేకరిస్తుంటారు. దాంతో వివిధ కూరలు చేసి తింటుంటారు. చింత చిగురు రుచికరమైన కూరనే కాకుండా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా అందిస్తుందని, చింతపండు కంటే చింత చిగురు ఎక్కువ ప్రయోజన కారి అని ఆయుర్వేదం చెబుతోంది. చింత చిగురులో ఎన్నో పోషక విలువలు, ఔషధ గుణాలు ఉన్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. చింత చిగురు కనిపిస్తే వెంటనే కొనుక్కుని రుచికరమైన కూరలు చేసుకుని ఆరగించాలని వారు సూచిస్తున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలు

● చింత చిగురు సహజ సిద్ధమైన లాక్జేటివ్‌గా పనిచేస్తుంది.

● యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండడంతో చింత చిగురు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది.

● చిగురును ఉడికించిన నీటిని పుక్కిలిస్తే గొంతు నొప్పి, మంట, వాపు తగ్గుతాయి. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చింత చిగురులో ఉండడమే ఇందుకు కారణం.

● కడుపులో నులి పురుగుల సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు చింత చిగురుతో చేసిన వంటలు తినిపిస్తే ఫలితం ఉంటుంది.

● జీర్ణాశయ సంబంధ సమస్యలను తొలగించడంలో చింత చిగురు బాగా ఉపయోగపడుతుంది. ఈ చిగురులో విటమిన్-సీ, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి శరీరంలో రోగ నిరోధక వ్యవస్థను పటిష్టపరుస్తాయి.

● తరచూ చింత చిగురును తింటే ఎముకలు ధృఢత్వాన్ని సంతరించుకుంటాయి.

● థైరాయిడ్‌తో బాధపడేవారు చింత చిగురును తమ ఆహారంలో తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

● గుండె జబ్బులను చింత చిగురు దరిచేరనీయదు. శరీరంలో ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందించడమే కాకుండా రక్తాన్ని శుద్ధి చేస్తుంది.

● చింత చిగురును పేస్టులా చేసి కీళ్లపై పెడితే నొప్పులు, వాపులు తగ్గుతాయి.

ఆదాయ మార్గంగా...

చింత చిగురు సేకరణను పీలేరు ప్రాంతంలోని చాలా మంది విద్యార్థులు వేసవి సెలవుల్లో ఆదాయ మార్గంగా మలుచుకుంటున్నారు. తమ సమీప ప్రాంతాల్లోని చింత చెట్ల నుంచి సేకరించిన చిగురును తమ తల్లిదండ్రులు, సోదరుల ద్వారా పీలేరులో ప్రతిరోజూ ఉదయం జరిగే దినసరి కూరగాయల మార్కెటులో విక్రయిస్తున్నారు. గతంలో పీలేరు ప్రాంతంలో చింత చెట్లు ఎక్కువగా ఉండేవి.

గడిచిన మూడేళ్లుగా చింత చెట్లకు ఎక్కువగా వస్తున్న చీడపీడల కారణంగా చిగురు దిగుబడి తగ్గిపోవడం, రోడ్ల విస్తరణ కారణంగా చింత చెట్లు కనుమరుగు కావడంతో వారికి చిగురు అంతంత మాత్రంగానే లభ్యమవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కుప్ప రూ.10 నుంచి రూ.20ల వరకు విక్రయిస్తున్నారు. సెలవుల్లో చిగురు కారణంగా సంపాదించిన అరాకొర డబ్బులతో స్కూళ్లు తెరిచాక పుస్తకాలు కొనుక్కుంటామని పలువురు తెలిపారు.

పవనసుతుడిపై పెంచలోరి వైభోగం

● ఉదయం హంసవాహనంపై ..

● నేడు నృసింహ జయంతి

● భారీగా తరలిరానున్న భక్తులు

రాపూరు, మే 10 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన క్షేత్రంలో లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు అంగరంగ వేభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో మూడవరోజు శనివారం ఉదయం పెంచల స్వామి సరస్వతీ అలంకరణలో హంసవాహనంపై విహరించారు. యాగశాలలో నిత్య హోమాలు, ఉత్సవమూర్తులకు ప్రత్యేక చందనాలంకారం, అభిషేకాలు కొనసాగుతున్నాయి. సాయంత్రం స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవ, రాత్రి తిరుచ్చిపై శ్రీవారిని ఉంచి క్షేత్రోత్సవం నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, ఉభయకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● స్వర్ణ హనుమంతుడిపై..

రాత్రి పెంచలస్వామి రామావతారంలో విల్లంబులు చేతబట్టి బంగారు హనుమంతుడిపై కొలువుదీరి భక్తులకు దర్శనం ఇచ్చారు. పరిమళ భరిత పూలమాలలు, విశేష ఆభరణాలతో అలంకృతమైన స్వామివారు మాడవీధుల్లో విహరించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కోన వీధుల్లో స్వామివారికి క్షేత్రోత్సవం నిర్వహించారు. కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం స్వామివారి సన్నిధిలో శివ నృత్య కళా నిలయానికి చెందిన (నెల్లూరు) చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



హంస వాహనంపై విహరిస్తున్న స్వామివారు



స్వర్ణ హనుమంతుడిపై విహరిస్తున్న పెంచలస్వామి

నేడు స్వర్ణగరుడ సేవ

భక్తుల ఇష్టదైవం లక్ష్మీ నృసింహుడు. ఈయనకు ప్రీతిపాత్రమైన వాహనం గరుత్మంతుడు. ఈ దేవదేవుడి జన్మదినం (నృసింహ జయంతి) ఆదివారం. ఎంతో విశిష్ట కలిగిన ఈ పర్వదినాన తమ దైవాన్ని కనులారా వీక్షించేందుకు కోనకు భక్తజనం పోటెత్తనుంది. ఆదివారం రాత్రి 11 గంటలకు స్వర్ణ గరుడుడిపై శ్రీవారు కొలువుదీరి మాఢవీధుల్లో విహరించనున్నారు.

కోదండరాముడికి స్నపన తిరుమంజనం

ఒంటిమిట్ట, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండ రామాలయంలో శనివారం స్నపన తిరుమంజనం కార్యక్రమం వైభవంగా జరిగింది. శనివారం వేకువజామునే ఆలయ అర్చకులు వీణరాఘవాచార్యులు, మనోజ్ కుమారులు మూలవిరాట్లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌స్వామి వారికి పట్టు వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలను అందజేశారు. అర్చకులు స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ అధికారులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.



సుగంధ ద్రవ్యాలను తీసుకువస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పీలేరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. కేవీపల్లె ఎస్‌ఐ చిన్నిరెడ్డెప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలికిరి మండలం గుడ్లూరుకు చెందిన సయ్యద్ బాషా (35) ద్విచక్ర వాహనంపై కలకడ నుంచి పీలేరు వైపు వస్తుండగా పీలేరు నుంచి కలకడ వైపు వెళుతున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు పీలేరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేవీపల్లె ఎస్‌ఐ తెలిపారు.



సయ్యద్ బాషా మృతదేహం

సంబేపల్లె యువకుడు బెంగళూరులో...

సంబేపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలం ఇందిరానగర్‌కు చెందిన సుండుపల్లె సాయిమహేశ్ (21) బెంగళూరులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి బంధువుల వివరాల మేరకు... సాయిమహేశ్ ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా వారం రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లాడు. తన ఖర్చుల నిమిత్తం ఖాళీ సమయంలో డెలివరీ బాయ్‌గా పనిచేసేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి బయప్పనపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో ఆర్డర్ డెలివరీ చేసి తిరిగి వస్తున్న సమయంలో రైల్వే క్రాసింగ్ చేస్తుండగా రైలు ఢీకొని దుర్మరణం చెందాడు. ఉద్యోగం సాధించి తమకు ఆధారంగా ఉంటాడని ఆశించిన ఆ కుటుంబం అతడి మృతితో ఆశను కోల్పోయింది. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.



సాయిమహేశ్ (ఫైల్)

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

రైల్వేకోడూరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధితుడికి శనివారం రాయలసీమ విద్యార్థి పరిరక్షణ సమితి అధ్యక్షుడు మల్లెం హేమంత్ రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలగౌరీమురళీయాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడన్నారు. విద్యార్థులు, స్నేహితులు, ఆర్ఎస్‌పీఎఫ్ కమిటీ కలిసి చందాలు వేసుకుని ఆయనకు సాయం అందించామన్నారు. కార్యక్రమంలో అలుగంటి పరుశురాం, పోలవరపు కిషోర్, విష్ణువర్ధన్, సూరిబాబు, మల్లెం శివ, బాష, కృష్ణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న మల్లెం హేమంత్

కమిటీ చిన్నది.. ఆదాయం పెద్దది...

● ఆదాయంలో దూసుకెళ్తున్న ములకలచెరువు మార్కెట్ కమిటీ

● లక్ష్యానికి మించి ఆదాయం... కరోనా సమయంలోనూ....

● టమోటా క్రయ... విక్రయాలతో పాటు ఆదాయంలో ముందుకు

ములకలచెరువు, మే 10 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ కమిటీ చిన్నదైనా... ఆదాయంలో పెద్దదిగా ఉంది. ప్రతి ఏటా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని మించి ఆదాయంలో దూసుకెళ్తోంది. టమోటా క్రయ, విక్రయాల్లో ఆసియాలోనే అతి పెద్ద మార్కెట్‌గా పేరొందిన మదనపల్లె మార్కెట్‌ను ఎప్పుడో వెనక్కి నెట్టింది. ములకలచెరువు మార్కెట్‌లో అత్యధికంగా టమోటా క్రయ, విక్రయాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచే టమోటాలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. అలాగే ఆదాయంలో కూడా లక్ష్యానికి మించి దూసుకెళ్తోంది. కరోనా సమయంలోనే ప్రభుత్వం కేటాయించిన ఆదాయ లక్ష్యాన్ని పూర్తి చేసుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యమైన రూ.1.24 కోట్లను అధిగమించి రూ.1.32 కోట్లు ఆదాయం వచ్చింది. ఒక్క టమోటాల ఎగుమతి చేస్తున్న వాహనాలకు విధిస్తున్న సెస్సు రూపంలోనే ఇంత పెద్దమొత్తంలో ఆదాయం వస్తుందంటే టమోటా క్రయ, విక్రయాల్లో ఏ స్థాయిలో జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. దీంతో ములకలచెరువు మార్కెట్ కమిటీ ఎంతో ప్రాధాన్యత సంచరించుకుంది. తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి మార్కెట్ కమిటీ ములకలచెరువులో ఉంది. మదనపల్లె మార్కెట్ కమిటీని పునర్విభజన చేసి 1992లో ములకలచెరువు మార్కెట్ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలతో పాటు తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లో రైతులు పండించిన టమోటాలను విక్రయించేందుకు ఇక్కడికి తీసుకొస్తారు. ఇక్కడ మండీ యజమానులు టమోటాలకు వేలం పాటలు నిర్వహిస్తారు. బయటి రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారస్థులు టమోటాలు కొనుగోలు చేస్తారు. కొనుగోలు చేసిన టమోటాలను లారీలు, లగేజీ వాహనాల్లో ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. టమోటాలు ఎగుమతి చేసే వాహనాలకు మార్కెట్ కమిటీ సిబ్బంది ఒక శాతం సెస్సు విధించి రసీదు ఇస్తారు. అలాగే ములకలచెరువు, బురకాయలకోటల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో వేరుశనగ కాయలు, వడ్లు, మొక్కజొన్నలు, రాగులు, ఉలవలు, కందులు తీసుకెళ్లే వాహనాలకు కూడా ఒక శాతం సెస్సు విధిస్తారు. 2012లో కరోనా వ్యాప్తి అధికంగా ఉన్న సమయంలో కూడా ములకలచెరువు మార్కెట్ కమిటీ ఆదాయంలో లక్ష్యాన్ని ఛేదించి లాభాలు రాబట్టింది.



మార్కెట్ యార్డు ప్రధాన ద్వారం



మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన టమోటాలు

నాలుగేళ్లలో మార్కెట్ కమిటీకి సమకూరిన ఆదాయం వివరాలు

ఏడాది	లక్ష్యం	ఆదాయం
2021-22	రూ.86.14 లక్షలు (కరోనా సమయం)	రూ.98 లక్షలు
2022-23	రూ.కోటి	రూ.1.10 కోట్లు
2023-24	రూ.1.10కోట్లు	రూ.1.12 కోట్లు
2024-25	రూ.1.24 కోట్లు	రూ.1.32 కోట్లు

మండీలు...దుకాణ సముదాయాల ద్వారా మరింత...

ములకలచెరువు మార్కెట్ కమిటీకి టమోటా మండీలు, దుకాణ సముదాయాల ద్వారా మరింత ఆదాయం వస్తోంది. టమోటా మండీలు, దుకాణాల సముదాయం ద్వారా ప్రతి నెలా బాడుగ వస్తోంది. వీటి ద్వారా ప్రతి ఏటా రూ.25 లక్షలు వరకు ఆదాయం సమకూరుతోంది. ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ ద్వారా ప్రభుత్వానికి ప్రతి ఏటా భారీగా ఆదాయం సమకూరుతోంది. టమోటా క్రయ, విక్రయాలు మరింతగా పుంజుకుంటే ఆదాయంలో కూడా మదనపల్లె మార్కెట్‌ను మించిపోయే అవకాశం లేకపోలేదు.

గ్రేడ్ తక్కువ...ఆదాయం ఎక్కువ

ములకలచెరువు మార్కెట్ కమిటీ ఆదాయం బాగా ఉన్నా ఏళ్ల తరబడిగా గ్రేడ్ పెరగడం లేదు. మార్కెట్ కమిటీకి ప్రతి ఏటా లక్ష్యానికి మించి ఆదాయం వస్తోంది. అయితే సహాయ కార్యదర్శి హోదాలోనే ఉండిపోయింది. గ్రేడ్ పెరిగితే ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది. గ్రేడ్ పెరిగి సిబ్బంది అధికారులు, సిబ్బంది సంఖ్య పెరిగితే ఆదాయంలో మదనపల్లె మార్కెట్ ఆదాయంలో పోటీ పడే అవకాశం ఉంది. గ్రేడ్ పెంచాలని పంపిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా మార్కెట్ కమిటీ గ్రేడ్ పెరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సమష్టి కృషితోనే ఆదాయం



సమిష్టి కృషితోనే లక్ష్యానికి మించి ఆదాయం సాధించగలిగాం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి మించి ఆదాయం సాధించడానికి మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ శ్రీకాంత్‌రెడ్డి, ఏడీ త్యాగరాజు సూచనల మేరకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. మార్కెట్ నుంచి టమోటాలు ఎగుమతి చేస్తున్న వాహనాలకు ఒక శాతం సెస్సు విధిస్తున్నాం. అలాగే చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కూడా సెస్సులు వసూలు చేస్తున్నాం. సిబ్బంది సహకారంలో ఆదాయం సాధిస్తున్నాం.ఈ ఏడాది ఆదాయం మరింతగా పెంచే విధంగా ముందుకుకెళ్తున్నాం. ఆదాయం వచ్చేందుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.

- నవీన్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి, ములకలచెరువు

శేషవాహన సేవలో లక్ష్మీ నృసింహస్వామి



పెండ్లిమర్రి, మే 10 (ఆంధ్రజ్యోతి): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వెయ్యినూతులకోన ఆలయంలో శేషవాహన సేవలో లక్ష్మీ నృసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయాన్నే వేదపారాయణం, విశ్వక్సేన ఆరాధన సాయంత్రం ధ్వజారోహణం, కలశస్థాపన, అగ్నిప్రతిష్ట, శాంతిహోమం నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని వేదపారాయణంలో పాల్గొన్నారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

నాడు ఆదర్శం... నేడు దయనీయం

- పర్యవేక్షణ కరువై సమస్యలతో సతమతం
- కనీస సౌకర్యాలకు దూరంగా కాకిరేణిపల్లె

ప్రొద్దుటూరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): కాకిరేణిపల్లె సింగిల్ విలేజ్ గ్రామ పంచాయతీ. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో జిల్లాలోనే ఆదర్శ పంచాయతీగా పేరుగాంచింది. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిర్మల్ గ్రామ పురస్కార్ అవార్డును కైవసం చేసుకుంది. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నియోజకవర్గాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న మారుమూల గ్రామం కాకిరేణిపల్లె ప్రస్తుతం కనీస సౌకర్యాలకు నోచుకోక తల్లడిల్లుతోంది. పర్యవేక్షణ కరువై, ప్రగతికి దూరమై సమస్యలతో సతమతం అవుతోంది. అటు పాలకులు, ఇటు అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో మౌలిక వసతులు లేక ప్రజల పాట్లు వర్ణనాతీతం.

కాకిరేణిపల్లె గ్రామ పంచాయతీలో దాదాపు 250 ఇళ్లు ఉండగా 600 మంది ఓటర్లతో, వెయ్యి మంది జనాభా ఉంది. ఇక్కడ ఏదైనా మౌలిక వసతుల్లో సమస్య తలెత్తితే పరిష్కరించే నాథుడు కరువయ్యారు. గ్రామంలో పంచాయతీ కార్యాలయం ఉన్నా అక్కడ సిబ్బంది ఉండరు. పంచాయతీ కార్యదర్శి మాత్రం తరచూ వచ్చి వెళుతుంటారు. గ్రామానికి మూడున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న చౌడూరులో కాకిరేణిపల్లెకు సంబంధించిన సచివాలయం ఉంది. సిబ్బంది అక్కడే విధులు నిర్వహిస్తుంటారు. దీంతో ఎలాంటి అవసరమొచ్చినా చౌడూరుకు వెళ్లాల్సి రావడంతో గ్రామస్థులకు వ్యయభారంగా మారింది. రోజుకు కనీసం నాలుగు గంటలు అయినా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు గ్రామంలో అందుబాటులో ఉండాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి...

గ్రామంలో తాగునీటి సరఫరా పైపులైనులో సమస్య ఏర్పడి సుమారు నెల రోజులపాటు తాగునీటికి తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని గ్రామస్థులు వాపోయారు. కనీసం మూగ జీవాలకు కూడా నీరు అందించలేని పరిస్థితుల్లో పాచిపట్టిన కోనేరులోని నీటిని ట్యాంకుల్లో నింపుకుని అవసరాలను తీర్చుకుంటూ అష్టకష్టాలు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గ్రామానికి సరఫరా అయ్యే ప్రధాన పైపులైను మళ్లీ లీకేజీలకు గురైంది. పెన్నాతీరం వద్ద చౌడూరు, పూజా ఇంటర్నేషనల్ స్కూల్, కాకిరేణిపల్లె గ్రామాలకు సరఫరా అయ్యే ప్రధాన పైపులైను ఉన్న ప్రాంతంలో ఇసుక ట్రాక్టర్ల రవాణా తాకిడికి లీకేజీలు మొదలయ్యాయి. కాకిరేణిపల్లె-చౌడూరు గ్రామం మధ్యలో పొలాల్లో మరొక చోట పైపులైను డ్యామేజీ అయ్యింది. దీనిపై ఎవరు దృష్టి సారించడంలేదని గ్రామస్థులు వాపోయారు.

చినుకుపడితే చిత్తడే

గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేదు. మురికినీటిని ఎవరి ఇళ్ల వద్ద వారే గుంతలు తవ్వుకుని వాటిల్లో వదులుతున్నారు. ఎగుడుదిగుడు రోడ్లు ఉన్న ఈ ప్రాంతంలో చినుకుపడితే అంతా చిత్తడిగా మారుతుంది. వర్షాకాలంలో గ్రామంలో నడవలేని పరిస్థితి. ఇటీవల కురిసిన వర్షానికి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట అపరిశుభ్రత నెలకొంది.

ఒకే ఒక్కడు

పారిశుధ్య నిర్వహణ గ్రామంలో అంతంత మాత్రమే. కాకిరేణిపల్లె మొత్తానికి ఒకే ఒక పారిశుధ్య కార్మికుడు ఉన్నాడని గ్రామస్థులు చెబుతున్నారు. చక్రాల రిక్షాపై రోజు కసువు సేకరణ చేయాల్సి వస్తుందని తెలిపారు. గ్రామంలో ఎక్కువగా పాడి సంపద ఉందని, వారానికి ఒక్కసారి అయినా పశువైద్య అధికారులు గ్రామంలో క్యాంపు నిర్వహించి వైద్యసేవలు అందించాలని కోరుతున్నారు.

గ్రామంలో నెలకొన్న సమస్యలపై పంచాయతీ కార్యదర్శి ఎం.రాజేశ్వరిని వివరణ కోరగా సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని చెప్పారు. ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి స్పందిస్తూ ఇటీవలే తాగునీటి పైపులైన్ల మరమ్మతు చేశామని, ఏవైనా సమస్యలు ఉంటే సర్పంచులు, కార్యదర్శుల ద్వారా తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు.



పంచాయతీ కార్యాలయం ఎదుట నెలకొన్న అపరిశుభ్రత



డ్రైనేజీలు లేక వీధుల్లో నిలిచిన మురుగునీరు



వాన వస్తే..

వర్షం కురిస్తే ఇళ్ల నుంచి బయటకు రాలేం. గ్రామంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న సిమెంటు రోడ్లు ఎత్తులో ఉండడంతో వర్షం వస్తే వీధుల్లో వర్షపు నీరు నిలబడి అంతా చిత్తడిగా మారుతోంది. అధికారులు స్పందించి చర్యలు చేయాలి.

- బోసం లక్ష్మిదేవి, కాకిరేణిపల్లె



వీధి దీపాలు వెలగడంలేదు

ఇటీవల కురిసిన వర్షానికి గ్రామంలో కారుచీకట్లు కమ్ముకున్నాయి. మొదటి బజారు, పెద్దమ్మ బజారు, కొత్తకొట్టాలు వీధుల్లో వీధి దీపాలు వెలుగడం లేదు. విద్యుత్తు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- మార్తల శివారెడ్డి, కాకిరేణిపల్లె

పట్టుబడిన బంగారానికి రూ.50వేలు జరిమానా



పత్రాలను పరిశీలించి వివరాలు సేకరిస్తున్న సేల్స్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ జ్ఞానానందరెడ్డి

పులివెందుల, మే 10 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో శుక్రవారం రాత్రి పట్టుబడిన బంగారానికి సంబంధించి సేల్స్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ జ్ఞానానందరెడ్డి రూ.50వేలు జరిమానా విధించినట్లు తెలిసింది. హైదరాబాద్ నుంచి వస్తున్న ఓ కారులో బంగారం ఉన్నట్లు శుక్రవారం రాత్రి 9గంటల ప్రాంతంలో అందిన సమాచారం మేరకు పులివెందుల అసిస్టెంట్ కమిషనర్ (సేల్స్ ట్యాక్స్) జ్ఞానానందరెడ్డి తన సిబ్బందితో దాడి చేశారు. పట్టుబడిన కారు, బంగారాన్ని, తరలించే వారిని సహా కార్యాలయానికి తరలించారు. వీటి విలువ దాదాపు రూ.2కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. బంగారు, వజ్రాలకు సంబంధించి పత్రాలను పులివెందులలోని కార్యాలయంలో అదేరోజు అర్ధరాత్రి 2.30గంటల వరకు పరిశీలించారు. నిశితంగా పరిశీలించిన అనంతరం దాదాపు 50 గ్రాముల బంగారానికి సరైన పత్రాలు లేవని తేలింది. దీంతో రూ.50వేలు జరిమానా విధించినట్లు తెలిసింది. అనంతరం బంగారం, వజ్రాలు సంబంధించిన వారికి అప్పగించారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి : యూటీఎఫ్

కడప ఎర్రముక్కపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ చేపడు తున్న పాఠశాలల పునఃవ్యవస్థీకరణ ప్రక్రియతోపాటు ఏ విధమైన స్పష్టమైన జీఓలు లేకుండానే రోజుకో ఆలోచనతో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అందరిలో తీవ్ర ఆందోళన కలిగిస్తుందని.. తక్షణం ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం యూటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపుమేరకు డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడును కలిసి ధర్నాకు సంబంధించిన నోటీసు అందేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వారం వారం గుర్తింపు ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహిస్తున్న సమావేశాలలో సమ స్యలు ప్రభుత్వం దృష్టికి తెచ్చినప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఉపాధ్యాయుల్లో చెలరేగుతున్న ఆందోళన నేపథ్యంలో పాఠశాలల పునఃవ్యవస్థీకరణకు సంబంధించిన ఈఓ 117 రద్దు చేసి.. దాని స్థానే కొత్త జీఓ విడుదల చేసి దాని ఆధారంగా మాత్రమే పాఠశాలలను పునఃవ్య వస్థీకరించాలని కోరారు. మున్సిపల్ పాఠశాలల్లో అప్‌గ్రేడేషన్ ప్రక్రియ సత్వరమే చేపట్టి ప్రమోషన్లను ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో మే 12న డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా, 16న రాష్ట్రస్థాయిలో విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, ఏజాస్ అహ్మద్, కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, రామకేశవ తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

ఘనంగా విజయ హోటల్ పునఃప్రారంభం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఇందిరెడ్డి మాధవరెడ్డి, వెంకటసుబ్బమ్మ

కడప ఎర్రముక్కపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని 1వ టౌన్ వద్ద ఉన్న టవర్ క్లాక్‌లో ఇందిరెడ్డి మాధవరెడ్డి ఆధ్వర్యంలో విజయ హోటల్‌ను శనివారం పునఃప్రారంభించారు. 1956లో నీలం సంజీవరెడ్డి ఆంధ్రా ఉపముఖ్య మంత్రి హోదాలో రహమతుల్లా టవర్ క్లాక్‌ను ప్రారంభించారు. ఇటీవల చాలావరకు దెబ్బతిన్న టవర్ క్లాక్‌ను ఇందిరెడ్డి మాధవరెడ్డి మరమ్మతులు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఇందులోనే విజయ హోటల్‌ను ఇందిరెడ్డి మాధవరెడ్డి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ముప్పై సంవత్సరాలుగా హోటల్ రంగంలో కడప, తిరుపతి నగరాల్లో ఉన్నామని, మిత్రులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. నగర ప్రజలకు రుచికరమైన శుచి, శుభ్రతతో బ్రాహ్మణ భోజనంతో పాటు నార్త్ ఇండియన్ డిషెస్ కూడా అందుబాటులో కలవని తెలిపారు. కార్యక్రమంలో కాకర్ల రామాంజనేయులు, ఆడిటర్ కాశింఖాన్, షరీఫ్‌ఖాన్, ఆంధ్రస్పైస్ శ్రీకాంత్‌రెడ్డి, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

గండి ఆలయాన్ని వెంటనే ప్రారంభించాలి : తులసిరెడ్డి

చక్రాయపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో చేపట్టిన ఆలయ పునఃనిర్మాణ పనులపై అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు పులివెందుల ఎమ్మెల్యే దృష్టిసారించకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డిలు అన్నారు. శనివారం వారు గండి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ గండి పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు మూల విరాట్టు తప్ప మిగతా నిర్మాణాలన్నిటిని పునఃనిర్మించాలని ప్రభుత్వం రూ.28 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఐదేళ్లయినా ప్రారంభం కాలేదన్నారు. మూల విరాట్టుకు కాకుండా బాలాలయంలోనే పూజలు జరుగుతున్నాయన్నారు. ఈ ఆలయం పునఃనిర్మాణ పనులు మొదలు పెట్టాక ప్రారంభమైన కాణిపాకం, అయోధ్య దేవాలయాలు ప్రారంభమయ్యాయన్నారు. కానీ గండి వీరాంజనేయస్వామి ఆలయం మూల విరాట్‌కు పూజలు పునఃప్రారంభం కాలేదన్నారు. మిగిలిన అరకొర పనులు పూర్తిచేసి జూలై 15లోగా ఉత్తరాయణ పుణ్యకాలంలోనే పునః ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, ఈఓ వెంకటసుబ్బయ్య, అర్చక స్వాములు కేసరి, రాజారమేష్, వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, వేముల మండలశాఖ అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



గండి క్షేత్రంలో ఆగిపోయిన ఆలయ పునఃనిర్మాణ పనులను పరిశీలిస్తున్న తులసిరెడ్డి తదితరులు

ప్రమాదవశాత్తు బస్సు కింద పడి యువకుడి మృతి



మృతి చెందిన అవకర్ల ప్రవీణ్ (ఫైల్)

బద్వేలు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్త చెరువు గ్రామానికి చెందిన అవకర్ల ప్రవీణ్ (37) అనే వ్యక్తి జడ్డర్ల సమీపంలో ప్రమాదవశాత్తు బస్సు కింద పడి మృతి చెందాడు. వివ రాల్లోకి వెళితే.. కొత్తచెరువు గ్రామా నికి చెందిన ప్రవీణ్ శివదర్శిని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. బద్వేలు నుంచి హైదరాబాదుకు నడిపే ఈ బస్సు శుక్రవారం రాత్రి బద్వేలు నుంచి బయల్దేరి వెళ్లింది. జడ్డర్ల సమీపంలోకి రాగానే బస్సు బ్రేకులు సరిగా పడడం లేదని డ్రైవరు చెప్పడంతో బస్సు కిందకు వెళ్లి ప్రవీ ణ్ పరిశీలిస్తున్న క్రమంలో డ్రైవరు బస్సును ముందుకు కదల్చడంతో టైర్లకింద పడి దుర్మరణం పాలయ్యాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బస్సు హెల్పరుగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ప్రవీణ్ మృతితో కుటుంబం వీధినపడ్డట్లయింది. మృతదేహం ఇంకా గ్రామానికి చేరలేదు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన ఓబులరెడ్డి అలియాస్ గిరి

ప్రొద్దుటూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి తన సొంత ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శనివారం ప్రొద్దుటూరు సాయి కుటీర్ రోడ్డులో వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు... సాయికుటీర్ రోడ్డులో మృతి చెందిన వ్యక్తి ఇంటి నుంచి పెద్ద ఎత్తున దుర్వాసన వస్తుండటంతో స్థాని కు లు ఇంటి తలుపులు తట్టి చూశారు. కానీ ఎంతకూ తలుపు తెరవక పోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఇంటి తలుపులు బద్దలు కొట్టి తెరిచారు. ఇంట్లో మార్తల ఓబులరెడ్డి అలియాస్ గిరి (43) అనే వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. ఓబులరెడ్డికి 2005లో వివా హమైంది. మద్యానికి బానిస కావడంతో ఏడు సంవత్సరాల క్రితం భార్య విడాకులు ఇచ్చింది. అప్పటి నుంచి ఓబులరెడ్డి ఇంట్లో ఒంట రిగా జీవిస్తున్నాడు. ఓబులరెడ్డి తల్లి క్యాన్సర్‌తో బాధపడుతుండగా అతని చెల్లెలు కర్నూలులో చికిత్స చేపిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఓబులరెడ్డి అనుమానాస్పదస్థితిలో మృతి చెందగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సింహ వాహనంపై చెన్నకేశవుడు



సింహవాహనంపై ఊరేగుతున్న చెన్నకేశవుడు

రాజుపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి సింహవాహనంపై శనివారం సాయంత్రం భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణలతో ఈ వేడుక అత్యంత వైభవంగా సాగింది. సింహవా హనంపై సతీసమేతంగా బయల్దేరిన స్వామివారు ఉత్సవం మాడవీధుల్లో కొనసాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం పల్లకీసేవ, రాత్రి సింహ వాహన సేవ నిర్వహించారు.

పి.బొమ్మేపల్లిలో ఘర్షణ

- 13 మందికి గాయాలు

జమ్మలమడుగు మే 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని పూర్వపు బొమ్మేపల్లెలో శనివారం సాయంత్రం ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడటంతో 13 మందికి గాయాలైనట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. ఇంటి ముందు పేడ చల్లే విషయంలో మహిళల మధ్య మాటామాటా పెరిగి వివాదానికి దారితీసింది. జరిగిన విషయాన్ని మహిళలు తమ ఇంటి యజమానులకు తెలియజేయడంతో ఒక్కసారిగా ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. దీంతో ఒక వర్గానికి చెందిన రాజ చౌడప్ప, పెద్ద చౌడప్ప, రమణమ్మ, పెద్ద చౌడమ్మ, రామచౌడయ్య, సుహాసిని, మరో వర్గానికి చెందిన నాగంజి మునేష్, నాగేంద్ర, రమాదేవి, గురులక్ష్మి, నడిపి సుబ్బ రాయుడులు గాయపడ్డారు. అందులో తీవ్రంగా గాయపడిన నాగంజి నడిపి సుబ్బరాయుడు, రాజ, చౌడయ్య అనే ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జమ్మలమడుగు మే 10 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీదేవీ భూదేవి సమేత నారాపురం వెంకటేశ్వరస్వామికి ఆనవాయితీగా తొలిపూజ జమ్మలమడుగు పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, మాజీ చైర్‌పర్సన్ టి.తులసి పూజలు నిర్వహించారు. కాగా, బ్రహ్మోత్సవాలలో భాగంగా 11న ఉదయం ధ్వజరోహణం, సాయంత్రం ఉంజల్‌సేవ, అన్నమాచార్య కీర్తనలు రాత్రి పెద్ద శేషవాహనం, 12న చిన్నశేషవాహనం, 13న ముత్యపు పందిరి వాహనం, 14న కల్ప వృక్షవాహనం, 15న మోహినీ అలంకారం, 16 సర్వభూపాల వాహనం, 17న రథోత్సవ కార్యక్రమం, 18న సూర్యప్రభ వాహనం, 19న చక్రస్నానం, 20న పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ప్రత్యేక ఏర్పాట్లు : బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండు రోజుల కిందట ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి పటిష్ట ఏర్పాట్లు జరిగేలా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆలయం ఎదురుగా అలంకరణ మండపం ఏర్పాటు చేశారు. ప్రత్యేక చలువ పందిర్లు వేశారు. ఆలయ ముఖద్వారం ఎదురుగా పార్కులో కూటమినేత గోణ పురుషోత్తంరెడ్డి భక్తులకు సౌకర్యం కోసం అరుగులు కట్టించారు.



అంకురార్పణ సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, తులసి దంపతులు





విద్యుద్దీపాలంకరణలో ఆలయ ముఖద్వారం, అలంకరణ మండపం

కిక్కెక్కిస్తున్న 'నాటు'... మద్యం మత్తు


సారా తయారీ కోసం డ్రమ్ముల్లో వేసిన ఊట

● ఊట ఊరుతోంది.. బట్టీ మండుతోంది ● విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
● చిల్లర అంగళ్లలో బీరు, క్వార్టర్ బాటిళ్లు ● చోద్యం చూస్తున్న అధికారులు


మండుతున్న సారా బట్టీ

సుండుపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): పచ్చని పల్లెల్లో నాటుసారా బట్టీలు మండుతున్నాయి. ఇంగ్లీష్ మద్యం విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. సుండుపల్లె మండలం అటవీ ప్రాంతానికి చేరువలో ఉండటంతో నాటుసారా బట్టీలు విస్తారంగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా ముండుంపాడు, మడితాడు, మా చిరెడ్డిగారిపల్లె, గుండ్లపల్లి, సుండుపల్లె, బాగంపల్లి తదితర గ్రామాల్లో సారా తయారీ అమ్మకాలు జోరుగా జరుగుతున్నట్లు సమాచారం. కేవీపల్లి మండలంలోని జిల్లెళ్ల మంద తండా నుంచి సుండుపల్లె మండలానికి పింఛా ప్రాజెక్టు మీదుగా నాటుసారా సరఫరా నిరంతరం జరుగుతోంది. ఇదంతా గత కొన్ని సంవత్సరాల నుంచి పోలీసు, ఎక్సైజ్ అధికారులకు తెలిసినా తూతూమంత్రంగా దాడులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలున్నాయి. కొంతమంది సారా తయారీ, అమ్మకాల్లో లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. అయినా అధికారులకు మాత్రం పట్టడం లేదు. మాచిరెడ్డిగారిపల్లె, ముడుంపాడు గ్రామ పంచాయతీల్లోని అటవీ పరిసర ప్రాంతాలు, మామిడి తోటలు సారా తయారీకి నిలయంగా మారాయి. సారా ఎక్కువగా, త్వరగా తయారు చేయాలని కొంత మంది సారా తయారీలో హానికర పదార్థాలను కూడా వినియోగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అది తాగి రోగాల బారిన పడటంతో పాటు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. ఒక బిందె సారా మీద సుమారు రూ.15 వేలకు మించి లాభం గడిస్తున్నట్లు సమాచారం. ఇంత లాభం వస్తుండడంతో త్వరగా ధనికులు కావాలనే తపనతో విచ్చలవిడిగా సారా అమ్మకాలు నిర్వహిస్తున్నారు. జిల్లెళ్ల మంద తండా నుంచి మండల కేంద్రానికి, ఇతర గ్రామాలకు సైతం సారా తరలిస్తున్నట్లు సమాచారం.

మరి కొంతమంది ఇంట్లోనే సారాను ప్యాకెట్లుగా తయారు చేసి అమ్ముకుంటున్నారని సమాచారం. కానీ అధికారులు మాత్రం తూతూ మంత్రంగా దాడులు చేసి కేసులు పెడుతున్నారే తప్ప శాశ్వత నిర్మూలనకు చర్యలు చేపట్టడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పల్లెపల్లెకూ వైన్ షాపు

కూటమి ప్రభుత్వం ఏర్పడి వైన్ షాపులు ప్రైవేటుపరం అయిన తర్వాత పల్లెపల్లెకూ వైన్ షాపు దర్శనమిస్తోంది. సుండుపల్లె మండల కేంద్రంలో మూడు మద్యం దుకాణాలకు ప్రభుత్వం టెండర్ల ద్వారా అనుమతులు ఇచ్చింది. అయితే అధికంగా తమ షాపు నుంచే మద్యం విక్రయాలు జరగాలన్న ఉద్దేశ్యంతో కొందరు పల్లెలకు మద్యం సరఫరా చేస్తున్నారు. చిల్లర అంగడి ఉన్న ప్రతి ఇంట్లో ఇంగ్లీషు మద్యం అమ్ముతున్నారు. మేమున్నామని భరోసా కల్పించి మరీ విక్రయాలను ప్రోత్సహిస్తున్నారు. ఫ్రిజ్‌లల్లో బీర్లు దర్శనమిస్తున్నాయి. మద్యం బాటిల్‌పై రూ.50 చొప్పున పెంచి అమ్ముకుంటున్నారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడం వెనుక మామూళ్లు అందుతున్నాయనే విమర్శలున్నాయి. నాటుసారాతో పాటు ఇంగ్లీష్ మద్యం విచ్చలవిడిగా దొరుకుతుండడంతో మండల కేంద్రానికి రావాల్సిన అవసరం కూడా లేకుండా తమ గ్రామాల్లోనే కావాల్సినంత లభిస్తుండటంతో యువకులు సైతం చెడు అలవాట్లకు బానిస అవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బెల్ట్ షాపులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటాం



పల్లెల్లో బెల్ట్ షాపులు పెడితే కఠిన చర్యలు తప్పవు. సారా తయారు చేసినా, విక్రయించినా చట్ట రీత్యా కేసులు నమోదు చేస్తాం. పల్లెల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే సమాచారం ఇవ్వండి. నాటు సారా తయారీ నిర్మూలనకు ప్రజలకు కూడా సహకరించాలి.

- శ్రీనివాసులు, ఎస్ఐ, సుండుపల్లె

చోరీల నివారణకు పోలీసుల నిఘా


తాళంవేసిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసు

రాయచోటిటౌన్, మే10(ఆంధ్రజ్యోతి): ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు దొంగతనాల నివారణలో భాగంగా పోలీసులు తాళం వేసిన ఇళ్లపై నిఘా ఏర్పాటు చేసినట్లు రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి తెలిపారు. ఇటీవల రాయచోటి పట్టణంలో చోరీలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు నిఘాను మరింత పెంచారు. కావున విహారయాత్రకు, స్వగ్రామాలకు, ఆలయాల సందర్శనకు వెళ్లే వారు తాళం వేసిన ఇంటి అడ్రస్సును పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనరసింహ స్వామికి పూజలు


లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధ్వజారోహణ నిర్వహిస్తున్న దృశ్యం

పెనగలూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల్లో శనివారం లక్ష్మీ నరసింహస్వామికి భక్తులు పూజలు చేశారు. పెనగలూరు మండలం నారాయణ నెల్లూరులోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధ్వజారోహణం వైభవంగా జరిగింది. పొందలూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ప్రాంగణాన్ని శోభాయమానంగా అలంకరించారు. అలాగే పెంచలకోన పుణ్యక్షేత్రానికి నడిచివెళ్లే భక్తులు స్వామిపాదాలకు తొలిపూజ చేసి అడవిలో నడక సాగించారు. కొండపై ఉన్న స్వామి పాదాలకు కాయ, కర్పూరాలు సమర్పించుకుని తరలివెళ్లారు.

నేడు మర్రిచెట్టు లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

లక్కిరెడ్డిపల్లె, మే10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయచోటి- వేంపల్లి రహదారిలో వెలిసిన మర్రిచెట్టు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. మర్లవాండ్లపల్లెకు చెందిన మార్ల రవీంద్రారెడ్డి కుటుంబ సభ్యులు స్వామి వారికి కల్యాణం నిర్వహిస్తారని, మాజీ ఎంపీటీసీ మదన్‌మోహన్ అన్నప్రసాద వితరణ చేస్తారన్నారు. భక్తులు హాజరై స్వామివారికృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

సిద్దవటం : కడప - చెన్నై జాతీయ రహదారి జేఎంజే కాలేజ్ ఎదురుగా వెలసిన పెంచల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కలశ స్థాపన పూజలు నిర్వహించినట్లు వేదపండితులు ప్రతాప్‌శర్మ తెలిపారు. సాయంత్రం అంకురార్పణ, దీక్షా హోమం, నవగ్రహ జపం నిర్వహించామన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

● మంత్రి మండిపల్లి

చిన్నమండెం, మే10(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ త్వరలో రేషన్‌కార్డులను పంపిణీ చేస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజాదర్బార్ కార్యక్రమంలో పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలు అందించి పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నారన్నారు. శనివారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పేదలకు సంక్షేమ పథకాలు అందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించి న్యాయం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇంకా ఎవరికైనా అర్హులై ఉండి కూడా ప్రభుత్వ ఫలాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని మంత్రి కోరారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను మంత్రి స్వీకరించారు. వాటిలో కొన్నింటిని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అక్కడికక్కడే పరిష్కరించారు.

రేపు ధర్నా

రాయచోటిటౌన్, మే10: (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 12వ తేదీన డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. జాబీర్ తెలిపారు. ఈ మేరకు వినతి పత్రాన్ని రాయచోటి అర్బన్ సీఐ వెంకటచలపతికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ చేపడుతున్న పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ రోజుకో నిబంధనతో ఆందోళనకు గురి చేస్తోందన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సమావేశాల్లో సమస్యలు వెల్లడిస్తున్నా పరిష్కారం కావడం లేదన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

లక్కిరెడ్డిపల్లె, మే10(ఆంధ్రజ్యోతి):పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని పెన్షనర్ల సంఘం జిల్లా జనరల్ సెక్రటరీ వీరబల్లి వెంకట్రమణ పేర్కొన్నారు. శనివారం స్థానిక విశ్రాంతి ఉద్యోగుల సభా భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2018 నుంచి 2025 వరకు పెండింగ్‌లో ఉన్న రాయితీలను, డీఏలను చెల్లించాలన్నారు. పెన్షనర్ల సంఘం అసోసియేషన్ ప్రెసిడెంట్ విశ్వనాథ, వైస్ ప్రెసిడెంట్ జమీల్‌బాషా, కుళాయప్ప, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.


4 కిలోల గంజాయి పట్టివేత

చిన్నమండెం, మే10(ఆంధ్రజ్యోతి): చిన్నమండెం, కలకడ మండలాలకు చెందిన షేక్. హసీంసాహెబ్, మ్యాజిక్ ఇమ్రాన్‌ఖాన్, షేక్. ఇమాన్‌సాహెబ్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి 4 కిలోలా 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.ఎస్ఐ వివరాల మేరకు..రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో దాడి చేశామన్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతి

సిద్దవటం, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నేకనాపురానికి చెందిన టీడీపీ సీనియర్ నేత ఎద్దుల వెంకటనరసయ్య శనివారం గుండెనొప్పితో మృతిచెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రాజంపేట జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ, రాష్ట్ర పంచాయతీరాజ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య, వెంకటనరసయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటనరసయ్య పార్టీ కోసం అంకితభావంతో పనిచేశారన్నారు.

వైభవంగా అంకాలమ్మ జల్ది కార్యక్రమం


ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మ తల్లి

రైల్వేకోడూరు, మే 10:(ఆంధ్రజ్యోతి): అంకాలమ్మ జల్ది కార్యక్రమం శుక్రవారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. ముగ్గులు వేసి అక్కడ జల్ది కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని వివిధ పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని వినతి


స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నేతలు

రాయచోటిటౌన్, మే10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ విజయరామరాజుకు నోబల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావులకు వినతి పత్రం సమర్పించారు. శనివారం మంగళగిరిలో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ విజయరామరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా రేషనలైజేషన్‌కు కటాఫ్ తేదీని ఏప్రిల్ వరకు తీసుకోవాలని, గత ఏప్రిల్ నెలలో డ్రాపౌట్స్‌ను చేర్పించడం వల్ల విద్యార్థులు రోల్ పెరిగిన పాఠశాలలకు ఎక్కువ పోస్టులు మంజూరు అవుతాయని, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:40గా తీసుకోవాలని కోరారు. అలాగే గత మార్చి నెలలో 10వ తరగతి పరీక్షల విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

ఓబులవారిపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లె మండలంలోని గొబ్బూరువారిపల్లె పంచాయతికి చెందిన అక్కమ్మగారి శంకరయ్య కు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కును బీ జేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి చెంగల్‌రాజు, మండల అధ్యక్షుడు ముక్కా రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.74 వేల చెక్కును వారి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమం లో బీజేపీ సీనియర్ నాయకులు కృష్ణ యాదవ్,తోట శ్రీనివాసులు, కె.శ్రీనివాసులు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, ముక్కా

రైల్వేకోడూరు, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కే.బుడుగుంటపల్లె నుంచి దేశెట్టిపల్లె వరకు సిమెంట్, తారు రోడ్డు నిర్మాణానికి శనివారం జనసేన పార్టీ ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి రూ.70 లక్షల వ్యయంతో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 10 నెలలలోనే రైల్వేకోడూరు నియోజకవర్గంలో సగానికి పైగా సీసీ రోడ్ల పనులు పూర్తి అయినట్లు తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించకపోతే చర్యలు

సంబేపల్లె, మే10(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని సంబేపల్లె ఎస్ఐ భక్తవత్సలం హెచ్చరించారు. శనివారం జాతీయ రహదారిపై స్టేషన్ ఎదుట వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలన్నారు. అజాగ్రత్త వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ఎన్నో కుటుంబాలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఎస్ఐ బాదుల్లా, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం: చమర్తి


అన్నదానం చేస్తున్న జగన్‌మోహన్‌రాజు

వీరబల్లి, మే10(ఆంధ్రజ్యోతి): అన్నదానం పుణ్యకార్యమని టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. వీరబల్లి మండలం గుర్రప్పగారిపల్లెలో శనివారం జరిగిన చిన్నగంగమ్మ తల్లి జాతరకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థుల ఆహ్వానం మేరకు ఆయన హాజరయ్యారు. ముందుగా జగన్‌మోహన్‌రాజు చిన్నగంగమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పేద మహిళకు ఆర్థిక సాయం

ఓబులవారిపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముక్కావారిపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన పేద మహిళకు జీవనజ్యోతి ఆనంద నిలయం ఆశ్రమ వ్యవస్థాపకుడు పాణ్యం సుబ్రమణ్యం ఆర్థిక సాయం చేశారు. ఆమెకు పోషకాహారం కోసం రూ.2 వేలను డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆమెకు అందజేశారు.

శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

రాజంపేట టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : శనిత్రయోదశి సందర్భంగా రాజంపేట పోలిచెరువు కట్టమీద వెలసిన శనీశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహిచారు. శనీశ్వరునికి తైలాభిషేకం చేశారు. అనంతరం పక్కనే ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మందగిరి శనీశ్వర స్వామికి పూజలు

సిద్దవటం, మే 10 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం మండలం పెద్దపల్లి పంచాయతీ కనుమలోపల్లె సమీపాన వెలసిన మందగిరి శనీశ్వరస్వామికి శనివారం తైలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు సుబ్రమణ్యం శర్మ, రామకృష్ణశర్మ, భక్తులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

రామాపురం, మే10(ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీలో సోమవారం సాయి నర్సింగ్ హోమ్ వారు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కంటి శుక్లాలకు కుట్లు లేకుండా లెన్సు అమర్చుతారని, అవసరమైన వారు వినియోగించుకోవాలన్నారు.

భాకరాపేటలో నాకాబందీ

సిద్దవటం, మే 10 (ఆంధ్రజ్యోతి) : భాకరాపేటలో శనివారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బాబు మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తుల గృహాలు, వాహనాలు తనిఖీ చేశామని, సైబర్ క్రైమ్ ట్రాఫిక్ రూల్స్ చోరీల నియంత్రణపై జాగ్రత్తలు, అవగాహన కల్పించామన్నారు.

మన దేశం, సైనికుల క్షేమం కోసం పూజలు


రైల్వేకోడూరు భుజంగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ తదితరులు

రైల్వేకోడూరు, మే 10(ఆంధ్రజ్యోతి): యుద్ధం నేపథ్యంలో మన దేశం, సైనికుల క్షేమం కోసం శనివారం భుజంగేశ్వరస్వామి ఆలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ త్రివిధ దళాల (ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, నేవీ, ఆర్మీ)కి ఆత్మస్థైర్యం, మనోధైర్యాన్ని కలిగించి ఉగ్రవాదులను అంతమొందించి విజయం సాధించాలని పూజలు చేశామన్నారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి పండిబోయిన కృష్ణయాదవ్, కన్వీనర్ గడ్డం చంగల్రాజు, కిసాన్ మోర్చా హార్టికల్చర్ రాష్ట్ర కన్వీనర్ తోట శ్రీనివాసులు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణవర్మ, నాయులు, కంబాల శ్రీనివాసులు, సాయం శ్రీధర్, కాశప్పగారి రాము, వాకచర్ల సుబ్బారావు, విశ్వహిందూపరిషత్ ప్రతినిధి దరిశా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో పూజలు

రాజంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): మన దేశం, సైనికులు క్షేమంగా విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో శనివారం పూజలు చేశారు. రాజంపేటలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు పోలిచెరువు శనీశ్వరాలయం, పంచముఖ ఆంజేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. భారత సైనికులు, ప్రధాని నరేంద్రమోదీ పేరుమీద అర్చన చేయించారు. బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పట్టణ అధ్యక్షులు వీవీ రమణ, సీనియర్ నాయకులు హిమగిరియాదవ్, పట్టణ ఉపాధ్యక్షులు పి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

రాయచోటిటౌన్, మే10(ఆంధ్రజ్యోతి): భారత్- పాకిస్థాన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధంలో మన సైనికులు విజయం సాధించాలని కోరుతూ శనివారం రాయచోటి పట్టణంలోని రెడ్డీస్‌కాలనీలో గల కోదండ రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకుడు కావలి వెంకటసుబ్బారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో రెడ్డీస్‌కాలనీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పలువురు ఆలయానికి చేరుకుని అర్చకులు రాంప్రసాద్‌శర్మ వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఓబులవారిపల్లెలో...

భారత సైనికులు, దేశ ప్రజలు క్షేమంగా ఉండాలని బీజేపీ నాయకులు పెద్దఓరంపాడులోని గౌరీసిద్ధేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్‌ను ఆహ్వానించి బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జి గడ్డం చెంగల్‌రాజు, మండల అధ్యక్షుడు ముక్కా రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోట శ్రీనివాస్, కృష్ణయ్యయాదవ్, వెంకట్, సుబ్బారెడ్డి, శేషయ్య పాల్గొన్నారు.

భారత సైనికులకు జేజేలు

నందలూరు, మే 10 (ఆంధ్రజ్యోతి) : మన సైనికులకు మద్దతుగా నందలూరులో బీజేపీ నాయకులు జేజేలు పలుకుతూ శనివారం సాయంత్రం అరవపల్లె కృష్ణమందిరం నుంచి అంబేడ్కర్ సర్కిల్ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాజంపేట అసెంబ్లీ కోకన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, అమ్మవారిశాల ఆలయ అధ్యక్షుడు యంబలూరు నరసింహ, టీడీపీ నేతలు మోడపోతుల రాము, ముమ్మడిశెట్టి రమేష్, ఉప్పుశెట్టి సుధీర్, గంధం గంగాధర్, నారపుశెట్టి శివయ్య, సురేష్, సుబ్బనరసయ్య, జనసేన నేతలు గురివిగారి వాసు, శ్రీహరి, వైసీపీ నేతలు బూసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కాకి చంద్ర, నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు పాల్గొన్నారు.

సిద్దవటం: భారత సైనికులకు దైవబలం ఉండాలని పెంచలకోన లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించామని టీడీపీ రాష్ట్ర వాణిజ్య అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు తెలిపారు. మండలంలోని మాధవరం-1 ఎస్‌కేఆర్ నగర్‌లో గల తన నివాసంలో ఆయన మాట్లాడారు.

వీర జవాన్ మురళీకి ఘన నివాళి

రాజంపేట టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : పాకిస్థాన్‌పై జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి శనివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో పూలమాల వేసి అశ్రునివాళులర్పించారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, వడ్డె రమణ, భాస్కర్‌రాజు, మిరియాల సురేఖ, గౌస్, ఈనాడు శ్రీను, కొండ్లోపల్లె శేఖర్‌రెడ్డి, బాలక్రిష్ణ, దయనాథ్, గోవర్దన్, భరత్, శివకుమార్, జుబేద్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగంగమ్మ.. చల్లంగ చూడమ్మా...

● అత్యంత మహిమ గల దేవరాయి ● ముస్తాబవుతున్న నల్లగంగమ్మ ఆలయం ● రేపు మొలకల పౌర్ణమి నాడు ఘనంగా అమ్మవారి జాతర

సంబేపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె దేవరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఈనెల 12వ తేదీ మొలకలపౌర్ణమి సందర్భంగా జాతర వైభవంగా జరగనుంది. ఆలయంలోని దేవరాయి **ఎంతో మహిమ గలదని ప్రజలు రకరకాలుగా చెబుతుంటారు**. దీర్ఘకాలంగా వివిధ రోగాలతో బాధపడుతున్న భక్తులు ఈ రాయిపై పొర్లు దండాలు పెడితే అవి నయమవుతాయని భక్తుల విశ్వాసం. ఆలయ చరిత్రను పరిశీలిస్తే.. పూర్వంలో ఓ బండరాయి సంబేపల్లె గ్రామం సమీపంలో నాలుగు కొండల మధ్య దట్టమైన ముళ్లపొదల్లో ఉండేది. ఓ మేకల కాపరి మేకలు మేపుకుంటుండగా ఆ రాయిపై కాలు పెట్టిన ఓ కుంటిమేకకు కాలు బాగవడంతో ఆ కాపరి గ్రామస్తులకు ఈ విషయాన్ని చెప్పాడు.

అంతే గ్రామస్తులు ముళ్లపొదల్లో వెతికి చూడగా ఆ బండపై తెలియని భాషలో అక్షరాలు, ముగ్గులు ఉండటంతో జనం ఆనాటి నుంచి ఆ రాతికి పూజలు చేయడం ప్రారంభించారు. తీర్థయాత్రలకు వెళుతున్న ఓ మహాముని చూసి ఇది శక్తివంతమైన దేవరాయిగా గుర్తించి ఆ బండ రాతికి ఎదురుగా నల్లగంగమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించి వెళ్లారు. చిన్నగుడిగా ఉన్న ఈ ఆలయాన్ని 2005లో రాయచోటి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త మునగా మురళీ స్వామి అమ్మవారి ఆశీస్సులతో ఆలయ నిర్మాణం చేశారు.

శక్తి ప్రదాయిని నల్లగంగమ్మ తల్లి

ఈ ఆలయం చుట్టూ కొండలు. ఆ కొండల మధ్య సువిశాలమైన ప్రాంతంలో నల్లగంగమ్మ ఆలయం నిర్మించారు. ఈ ఆలయానికి తూర్పున కదిరిదేవుని కొండ, పడమర దుర్గం కొండ, ఉత్తరాన వెదుర్గ కొండ, దక్షిణాన ముగదాల కొండ మధ్యన వెలిసిన నల్లగంగమ్మ తల్లి భక్తుల కోర్కెలు తీర్చే అమ్మగా పిలవబడుతోంది. కర్ణాటక, చిత్తూరు, కడప తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం విశేషం. ఇక్కడ సినిమా హీరో శరత్‌కుమార్ తమిళ చిత్రం షూటింగ్ కూడా జరిగింది.





ప్రత్యేక అలంకరణలో నల్లగంగమ్మ తల్లి, మహిమ గల దేవరాయి

గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి రూ.1.18 కోట్లతో 2022లో మహా మండపం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పనులు పూర్తి కావడంతో సర్వాంగ సుందరంగా ఆలయం తయారైంది. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఆలయం చుట్టూ రూ.ఒక కోటి నిధులతో సిమెంటు రోడ్లు వేశారు.

12న అమ్మవారి జాతర

ఈనెల 12వ తేదీన మొలకలపౌర్ణమి సందర్భంగా అమ్మవారి జాతర కనులపండువగా జరుగుతుంది. చిత్తూరు, తిరుపతి, కడప, అనంతపురం ప్రాంతాల నుంచి ప్రజలు అమ్మవారి జాతరలో పెద్దఎత్తున పాల్గొంటారు. రాత్రి భక్తుల కోసం జబర్దస్త్ యాక్టర్లచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనంతరం అమ్మవారికి మొక్కుబడి కోసం కట్టిన చాందినీ బండ్లను ఆలయం చుట్టూ తిప్పి 13వ తేదీ అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కుబడులు చెల్లిస్తారు.



గతంలో ఇక్కడ ఉన్న పురాతన ఆలయం, ఆలయాన్ని నూతనంగా నిర్మించిన మునగా మురళీస్వామి

పవనసుతుడిపై పెంచలోరి వైభోగం

● ఉదయం హంసవాహనంపై ..
● నేడు నృసింహ జయంతి
● భారీగా తరలిరానున్న భక్తులు

రాపూరు, మే 10 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన క్షేత్రంలో లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో మూడవరోజు శనివారం ఉదయం పెంచలస్వామి సరస్వతీ అలంకరణలో హంసవాహనంపై విహరించారు. యాగశాలలో నిత్య హోమాలు, ఉత్సవమూర్తులకు ప్రత్యేక చందనాలంకారం, అభిషేకాలు కొనసాగుతున్నాయి. సాయంత్రం స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవ, రాత్రి తిరుచ్చిపై శ్రీవారిని ఉంచి క్షేత్రోత్సవం నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, ఉభయకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● స్వర్ణ హనుమంతుడిపై..

రాత్రి పెంచలస్వామి రామావతారంలో విల్లంబులు చేతబట్టి బంగారు హనుమంతుడిపై కొలువుదీరి భక్తులకు దర్శనం ఇచ్చారు. పరిమళ భరిత పూలమాలలు, విశేష ఆభరణాలతో అలంకృతమైన స్వామివారు మాడవీధుల్లో విహరించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కోన వీధుల్లో స్వామివారికి క్షేత్రోత్సవం నిర్వహించారు. కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం స్వామివారి సన్నిధిలో శివ నృత్య కళా నిలయానికి చెందిన (నెల్లూరు) చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



హంస వాహనంపై విహరిస్తున్న స్వామివారు



స్వర్ణ హనుమంతుడిపై విహరిస్తున్న పెంచలస్వామి

నేడు స్వర్ణగరుడ సేవ

భక్తుల ఇష్టదైవం లక్ష్మీ నృసింహుడు. ఈయనకు ప్రీతిపాత్రమైన వాహనం గరుత్మంతుడు. ఈ దేవదేవుడి జన్మదినం (నృసింహ జయంతి) ఆదివారం. ఎంతో విశిష్ట కలిగిన ఈ పర్వదినాన తమ దైవాన్ని కనులారా వీక్షించేందుకు కోనకు భక్తజనం పోటెత్తనుంది. ఆదివారం రాత్రి 11 గంటలకు స్వర్ణ గరుడుడిపై శ్రీవారు కొలువుదీరి మాడవీధుల్లో విహరించనున్నారు.

చింత తీర్చే చిగురు!



చింత చిగురును కొనుగోలు చేస్తున్న మహిళ

పీలేరు, మే 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మాత్రమే దొరికే ఆహార పదార్థాల్లో మామిడి, తాటి ముంజల తరువాత చింత చిగురు కూడా ఒకటి. వేసవి వచ్చిందంటే గ్రామాలలో చిన్నపిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు చింత చెట్ల చుట్టూ చేరి చిగురు సేకరిస్తుంటారు. దాంతో వివిధ కూరలు చేసి తింటుంటారు. చింత చిగురు రుచికరమైన కూరనే కాకుండా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా అందిస్తుందని, చింతపండు కంటే చింత చిగురు ఎక్కువ ప్రయోజన కారి అని ఆయుర్వేదం చెబుతోంది. చింత చిగురులో ఎన్నో పోషక విలువలు, ఔషధ గుణాలు ఉన్నాయని పౌష్టికాహార నిపుణులు చెబుతున్నారు. చింత చిగురు కనిపిస్తే వెంటనే కొనుక్కుని రుచికరమైన కూరలు చేసుకుని ఆరగించాలని వారు సూచిస్తున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలు

- చింత చిగురు సహజ సిద్ధమైన లాక్సేటివ్‌గా పనిచేస్తుంది.
- యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండడంతో చింత చిగురు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది.
- చిగురును ఉడికించిన నీటిని పుక్కిలిస్తే గొంతు నొప్పి, మంట, వాపు తగ్గుతాయి. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చింత చిగురులో ఉండడమే ఇందుకు కారణం.
- కడుపులో నులి పురుగుల సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు చింత చిగురుతో చేసిన వంటలు తినిపిస్తే ఫలితం ఉంటుంది.
- జీర్ణాశయ సంబంధ సమస్యలను తొలగించడంలో చింత చిగురు బాగా ఉపయోగపడుతుంది. ఈ చిగురులో విటమిన్-సీ, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి శరీరంలో రోగ నిరోధక వ్యవస్థను పటిష్టపరుస్తాయి.
- తరచూ చింత చిగురును తింటే ఎముకలు ధృఢత్వాన్ని సంతరించుకుంటాయి.
- థైరాయిడ్‌తో బాధపడేవారు చింత చిగురును తమ ఆహారంలో తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.
- గుండె జబ్బులను చింత చిగురు దరిచేరనీయదు. శరీరంలో ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందించడమే కాకుండా రక్తాన్ని శుద్ధి చేస్తుంది.
- చింత చిగురును పేస్టులా చేసి కీళ్లపై పెడితే నొప్పులు, వాపులు తగ్గుతాయి.

ఆదాయ మార్గంగా...

చింత చిగురు సేకరణను పీలేరు ప్రాంతంలోని చాలా మంది విద్యార్థులు వేసవి సెలవుల్లో ఆదాయ మార్గంగా మలుచుకుంటున్నారు. తమ సమీప ప్రాంతాల్లోని చింత చెట్ల నుంచి సేకరించిన చిగురును తమ తల్లిదండ్రులు, సోదరుల ద్వారా పీలేరులో ప్రతిరోజూ ఉదయం జరిగే దినసరి కూరగాయల మార్కెటులో విక్రయిస్తున్నారు. గతంలో పీలేరు ప్రాంతంలో చింత చెట్టు ఎక్కువగా ఉండేవి.

గడిచిన మూడేళ్లుగా చింత చెట్లకు ఎక్కువగా వస్తున్న చీడపీడల కారణంగా చిగురు దిగుబడి తగ్గిపోవడం, రోడ్ల విస్తరణ కారణంగా చింత చెట్లు కనుమరుగు కావడంతో వారికి చిగురు అంతంత మాత్రంగానే లభ్యమవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కుప్ప రూ.10 నుంచి రూ.20ల వరకు విక్రయిస్తున్నారు. సెలవుల్లో చిగురు కారణంగా సంపాదించిన అరాకొర డబ్బులతో స్కూళ్లు తెరిచాక పుస్తకాలు కొనుక్కుంటామని పలువురు తెలిపారు.

కోదండరాముడికి స్నపన తిరుమంజనం

ఒంటిమిట్ట, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండ రామాలయంలో శనివారం స్నపన తిరుమంజనం కార్యక్రమం వైభవంగా జరిగింది. శనివారం వేకువజామునే ఆలయ అర్చకులు వీణరాఘవాచార్యులు, మనోజ్ కుమారులు మూలవిరాట్లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌స్వామి వారికి పట్టు వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలను అందజేశారు. అర్చకులు స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ అధికారులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.



సుగంధ ద్రవ్యాలను తీసుకువస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పీలేరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. కేవీపల్లె ఎస్‌ఐ చిన్నిరెడ్డెప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలికిరి మండలం గుడ్లూరుకు చెందిన సయ్యద్ బాషా (35) ద్విచక్ర వాహనంపై కలకడ నుంచి పీలేరు వైపు వస్తుండగా పీలేరు నుంచి కలకడ వైపు వెళుతున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు పీలేరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేవీపల్లె ఎస్‌ఐ తెలిపారు.



సయ్యద్ బాషా మృతదేహం

సంబేపల్లె యువకుడు బెంగళూరులో...

సంబేపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలం ఇందిరానగర్‌కు చెందిన నుండుపల్లె సాయిమహేశ్ (21) బెంగళూరులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి బంధువుల వివరాల మేరకు... సాయిమహేశ్ ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా వారం రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లాడు. తన ఖర్చుల నిమిత్తం ఖాళీ సమయంలో డెలివరీ బాయ్‌గా పనిచేసేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి బయప్పనపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో ఆర్డర్ డెలివరీ చేసి తిరిగి వస్తున్న సమయంలో రైల్వే క్రాసింగ్ చేస్తుండగా రైలు ఢీకొని దుర్మరణం చెందాడు. ఉద్యోగం సాధించి తమకు ఆధారంగా ఉంటాడని ఆశించిన ఆ కుటుంబం అతడి మృతితో ఆశను కోల్పోయింది. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.



సాయిమహేశ్ (ఫైల్)

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

రైల్వేకోడూరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధితుడికి శనివారం రాయలసీమ విద్యార్థి పరిరక్షణ సమితి అధ్యక్షుడు మల్లెం హేమంత్ రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలగౌరీమురళీయాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడన్నారు. విద్యార్థులు, స్నేహితులు, ఆర్ఎస్‌పీఎఫ్ కమిటీ కలిసి చందాలు వేసుకుని ఆయనకు సాయం అందించామన్నారు. కార్యక్రమంలో అలుగంటి పరుశురాం, పోలవరపు కిషోర్, విష్ణువర్ధన్, సూరిబాబు, మల్లెం శివ, బాష, కృష్ణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న మల్లెం హేమంత్

కమిటీ చిన్నది.. ఆదాయం పెద్దది...

● ఆదాయంలో దూసుకెళ్తున్న ములకలచెరువు మార్కెట్ కమిటీ
● లక్ష్యానికి మించి ఆదాయం... కరోనా సమయంలోనూ....
● టమోటా క్రయ... విక్రయాలతో పాటు ఆదాయంలో ముందుకు

ములకలచెరువు, మే 10 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ కమిటీ చిన్నదైనా... ఆదాయంలో పెద్దదిగా ఉంది. ప్రతి ఏటా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని మించి ఆదాయంలో దూసుకెళ్తోంది. టమోటా క్రయ, విక్రయాల్లో ఆసియాలోనే అతి పెద్ద మార్కెట్‌గా పేరొందిన మదనపల్లె మార్కెట్‌ను ఎప్పుడో వెనక్కి నెట్టింది. ములకలచెరువు మార్కెట్‌లో అత్యధికంగా టమోటా క్రయ, విక్రయాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచే టమోటాలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. అలాగే ఆదాయంలో కూడా లక్ష్యానికి మించి దూసుకెళ్తోంది. కరోనా సమయంలోనే ప్రభుత్వం కేటాయించిన ఆదాయ లక్ష్యాన్ని పూర్తి చేసుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యమైన రూ.1.24 కోట్లను అధిగమించి రూ.1.32 కోట్లు ఆదాయం వచ్చింది. ఒక్క టమోటాల ఎగుమతి చేస్తున్న వాహనాలకు విధిస్తున్న సెస్సు రూపంలోనే ఇంత పెద్దమొత్తంలో ఆదాయం వస్తుందంటే టమోటా క్రయ, విక్రయాల్లో ఏ స్థాయిలో జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. దీంతో ములకలచెరువు మార్కెట్ కమిటీ ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి మార్కెట్ కమిటీ ములకలచెరువులో ఉంది. మదనపల్లె మార్కెట్ కమిటీని పునర్విభజన చేసి 1992లో ములకలచెరువు మార్కెట్ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలతో పాటు తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లో రైతులు పండించిన టమోటాలను విక్రయించేందుకు ఇక్కడికి తీసుకొస్తారు. ఇక్కడ మండీ యజమానులు టమోటాలకు వేలం పాటలు నిర్వహిస్తారు. బయటి రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారస్థులు టమోటాలు కొనుగోలు చేస్తారు. కొనుగోలు చేసిన టమోటాలను లారీలు, లగేజీ వాహనాల్లో ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. టమోటాలు ఎగుమతి చేసే వాహనాలకు మార్కెట్ కమిటీ సిబ్బంది ఒక శాతం సెస్సు విధించి రసీదు ఇస్తారు. అలాగే ములకలచెరువు, బురకాయలకోటల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో వేరుశనగకాయలు, వడ్లు, మొక్కజొన్నలు, రాగులు, ఉలవలు, కందులు తీసుకెళ్లే వాహనాలకు కూడా ఒక శాతం సెస్సు విధిస్తారు. 2012లో కరోనా వ్యాప్తి అధికంగా ఉన్న సమయంలో కూడా ములకలచెరువు మార్కెట్ కమిటీ ఆదాయంలో లక్ష్యాన్ని ఛేదించి లాభాలు రాబట్టింది.



మార్కెట్ యార్డు ప్రధాన ద్వారం



మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన టమోటాలు

నాలుగేళ్లలో మార్కెట్ కమిటీకి సమకూరిన ఆదాయం వివరాలు

ఏడాది	లక్ష్యం	ఆదాయం
2021-22	రూ.86.14 లక్షలు (కరోనా సమయం)	రూ.98 లక్షలు
2022-23	రూ.కోటి	రూ.1.10 కోట్లు
2023-24	రూ.1.10కోట్లు	రూ.1.12 కోట్లు
2024-25	రూ.1.24 కోట్లు	రూ.1.32 కోట్లు


మండీలు...దుకాణ సముదాయాల ద్వారా మరింత...

ములకలచెరువు మార్కెట్ కమిటీకి టమోటా మండీలు, దుకాణ సముదాయాల ద్వారా మరింత ఆదాయం వస్తోంది. టమోటా మండీలు, దుకాణాల సముదాయం ద్వారా ప్రతి నెలా బాడుగ వస్తోంది. వీటి ద్వారా ప్రతి ఏటా రూ.25 లక్షలు వరకు ఆదాయం సమకూరుతోంది. ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ ద్వారా ప్రభుత్వానికి ప్రతి ఏటా భారీగా ఆదాయం సమకూరుతోంది. టమోటా క్రయ, విక్రయాలు మరింతంగా పుంజుకుంటే ఆదాయంలో కూడా మదనపల్లె మార్కెట్‌ను మించిపోయే అవకాశం లేకపోలేదు.

గ్రేడ్ తక్కువ...ఆదాయం ఎక్కువ

ములకలచెరువు మార్కెట్ కమిటీ ఆదాయం బాగా ఉన్నా ఏళ్ల తరబడిగా గ్రేడ్ పెరగడం లేదు. మార్కెట్ కమిటీకి ప్రతి ఏటా లక్ష్యానికి మించి ఆదాయం వస్తోంది. అయితే సహాయ కార్యదర్శి హోదాలోనే ఉండిపోయింది. గ్రేడ్ పెరిగితే ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది. గ్రేడ్ పెరిగి సిబ్బంది అధికారులు, సిబ్బంది సంఖ్య పెరిగితే ఆదాయంలో మదనపల్లె మార్కెట్ ఆదాయంలో పోటీ పడే అవకాశం ఉంది. గ్రేడ్ పెంచాలని పంపిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా మార్కెట్ కమిటీ గ్రేడ్ పెరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సమష్టి కృషితోనే ఆదాయం



సమిష్టి కృషితోనే లక్ష్యానికి మించి ఆదాయం సాధించగలిగాం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి మించి ఆదాయం సాధించడానికి మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ శ్రీకాంత్‌రెడ్డి, ఏడీ త్యాగరాజు సూచనల మేరకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. మార్కెట్ నుంచి టమోటాలు ఎగుమతి చేస్తున్న వాహనాలకు ఒక శాతం సెస్సు విధిస్తున్నాం. అలాగే చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కూడా సెస్సులు వసూలు చేస్తున్నాం. సిబ్బంది సహకారంలో ఆదాయం సాధిస్తున్నాం.ఈ ఏడాది ఆదాయం మరింతగా పెంచే విధంగా ముందుకుకెళ్తున్నాం. ఆదాయం వచ్చేందుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.

- నవీన్‌కుమార్‌రెడ్డి,
మార్కెట్ కమిటీ కార్యదర్శి, ములకలచెరువు

శేషవాహన సేవలో లక్ష్మీ నృసింహస్వామి



పెండ్లిమర్రి, మే 10 (ఆంధ్రజ్యోతి): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వెయ్యినూతులకోన ఆలయంలో శేషవాహన సేవలో లక్ష్మీ నృసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయాన్నే వేదపారాయణం, విశ్వక్సేన ఆరాధన సాయంత్రం ధ్వజారోహణం, కలశస్థాపన, అగ్నిప్రతిష్ట, శాంతిహోమం నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని వేదపారాయణంలో పాల్గొన్నారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

నాడు ఆదర్శం... నేడు దయనీయం

- పర్యవేక్షణ కరువై సమస్యలతో సతమతం
- కనీస సౌకర్యాలకు దూరంగా కాకిరేణిపల్లె

ప్రొద్దుటూరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): కాకిరేణిపల్లె సింగిల్ విలేజ్ గ్రామ పంచాయతీ. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో జిల్లాలోనే ఆదర్శ పంచాయతీగా పేరుగాంచింది. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిర్మల్ గ్రామ పురస్కార్ అవార్డును కైవసం చేసుకుంది. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నియోజకవర్గాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న మారుమూల గ్రామం కాకిరేణిపల్లె ప్రస్తుతం కనీస సౌకర్యాలకు నోచుకోక తల్లడిల్లుతోంది. పర్యవేక్షణ కరువై, ప్రగతికి దూరమై సమస్యలతో సతమతం అవుతోంది. అటు పాలకులు, ఇటు అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో మౌలిక వసతులు లేక ప్రజల పాట్లు వర్ణణాతీతం.

కాకిరేణిపల్లె గ్రామ పంచాయతీలో దాదాపు 250 ఇళ్లు ఉండగా 600 మంది ఓటర్లతో, వెయ్యి మంది జనాభా ఉంది. ఇక్కడ ఏదైనా మౌలిక వసతుల్లో సమస్య తలెత్తితే పరిష్కరించే నాథుడు కరువయ్యారు. గ్రామంలో పంచాయతీ కార్యాలయం ఉన్నా అక్కడ సిబ్బంది ఉండరు. పంచాయతీ కార్యదర్శి మాత్రం తరచూ వచ్చి వెళుతుంటారు. గ్రామానికి మూడున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న చౌడూరులో కాకిరేణిపల్లెకు సంబంధించిన సచివాలయం ఉంది. సిబ్బంది అక్కడే విధులు నిర్వహిస్తుంటారు. దీంతో ఎలాంటి అవసరమొచ్చినా చౌడూరుకు వెళ్లాల్సి రావడంతో గ్రామస్థులకు వ్యయభారంగా మారింది. రోజుకు కనీసం నాలుగు గంటలు అయినా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు గ్రామంలో అందుబాటులో ఉండాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి...

గ్రామంలో తాగునీటి సరఫరా పైపులైనులో సమస్య ఏర్పడి సుమారు నెల రోజులపాటు తాగునీటికి తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని గ్రామస్థులు వాపోయారు. కనీసం మూగ జీవాలకు కూడా నీరు అందించలేని పరిస్థితుల్లో పాచిపట్టిన కోనేరులోని నీటిని ట్యాంకుల్లో నింపుకుని అవసరాలను తీర్చుకుంటూ అష్టకష్టాలు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గ్రామానికి సరఫరా అయ్యే ప్రధాన పైపులైను మళ్లీ లీకేజీలకు గురైంది. పెన్నాతీరం వద్ద చౌడూరు, పూజా ఇంటర్నేషనల్ స్కూల్, కాకిరేణిపల్లె గ్రామాలకు సరఫరా అయ్యే ప్రధాన పైపులైను ఉన్న ప్రాంతంలో ఇసుక ట్రాక్టర్ల రవాణా తాకిడికి లీకేజీలు మొదలయ్యాయి. కాకిరేణిపల్లె-చౌడూరు గ్రామం మధ్యలో పొలాల్లో మరొక చోట పైపులైను డ్యామేజీ అయ్యింది. దీనిపై ఎవరు దృష్టి సారించడంలేదని గ్రామస్థులు వాపోయారు.

చినుకుపడితే చిత్తడే

గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేదు. మురికినీటిని ఎవరి ఇళ్ల వద్ద వారే గుంతలు తవ్వుకుని వాటిల్లో వదులుతున్నారు. ఎగుడుదిగుడు రోడ్లు ఉన్న ఈ ప్రాంతంలో చినుకుపడితే అంతా చిత్తడిగా మారుతుంది. వర్షాకాలంలో గ్రామంలో నడవలేని పరిస్థితి. ఇటీవల కురిసిన వర్షానికి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట అపరిశుభ్రత నెలకొంది.

ఒకే ఒక్కడు

పారిశుధ్య నిర్వహణ గ్రామంలో అంతంత మాత్రమే. కాకిరేణిపల్లె మొత్తానికి ఒకే ఒక పారిశుధ్య కార్మికుడు ఉన్నాడని గ్రామస్థులు చెబుతున్నారు. చక్రాల రిక్షాపై రోజు కసువు సేకరణ చేయాల్సి వస్తుందని తెలిపారు. గ్రామంలో ఎక్కువగా పాడి సంపద ఉందని, వారానికి ఒక్కసారి అయినా పశువైద్య అధికారులు గ్రామంలో క్యాంపు నిర్వహించి వైద్యసేవలు అందించాలని కోరుతున్నారు.

గ్రామంలో నెలకొన్న సమస్యలపై పంచాయతీ కార్యదర్శి ఎం.రాజేశ్వరిని వివరణ కోరగా సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని చెప్పారు. ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి స్పందిస్తూ ఇటీవలే తాగునీటి పైపులైన్ల మరమ్మతు చేశామని, ఏవైనా సమస్యలు ఉంటే సర్పంచులు, కార్యదర్శుల ద్వారా తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు.



వాన వస్తే..

వర్షం కురిస్తే ఇళ్ల నుంచి బయటకు రాలేం. గ్రామంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న సిమెంటు రోడ్లు ఎత్తులో ఉండడంతో వర్షం వస్తే వీధుల్లో వర్షపు నీరు నిలబడి అంతా చిత్తడిగా మారుతోంది. అధికారులు స్పందించి చర్యలు చేయాలి.

- బోనం లక్ష్మిదేవి, కాకిరేణిపల్లె



వీధి దీపాలు వెలగడంలేదు

ఇటీవల కురిసిన వర్షానికి గ్రామంలో కారుచీకట్లు కమ్ముకున్నాయి. మొదటి బజారు, పెద్దమ్మ బజారు, కొత్తకొట్టాలు వీధుల్లో వీధి దీపాలు వెలుగడం లేదు. విద్యుత్తు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- మార్తల శివారెడ్డి, కాకిరేణిపల్లె



పంచాయతీ కార్యాలయం ఎదుట నెలకొన్న అపరిశుభ్రత



డ్రైనేజీలు లేక వీధుల్లో నిలిచిన మురుగునీరు

పట్టుబడిన బంగారానికి రూ.50వేలు జరిమానా



పత్రాలను పరిశీలించి వివరాలు సేకరిస్తున్న సేల్స్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ జ్ఞానానందరెడ్డి

పులివెందుల, మే 10 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో శుక్రవారం రాత్రి పట్టుబడిన బంగారానికి సంబంధించి సేల్స్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ జ్ఞానానందరెడ్డి రూ.50వేలు జరిమానా విధించినట్లు తెలిసింది. హైదరాబాద్ నుంచి వస్తున్న ఓ కారులో బంగారం ఉన్నట్లు శుక్రవారం రాత్రి 9గంటల ప్రాంతంలో అందిన సమాచారం మేరకు పులివెందుల అసిస్టెంట్ కమిషనర్ (సేల్స్ ట్యాక్స్) జ్ఞానానందరెడ్డి తన సిబ్బందితో దాడి చేశారు. పట్టుబడిన కారు, బంగారాన్ని, తరలించే వారిని సహా కార్యాలయానికి తరలించారు. వీటి విలువ దాదాపు రూ.2కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. బంగారు, వజ్రాలకు సంబంధించి పత్రాలను పులివెందులలోని కార్యాలయంలో అదేరోజు అర్ధరాత్రి 2.30గంటల వరకు పరిశీలించారు. నిశితంగా పరిశీలించిన అనంతరం దాదాపు 50 గ్రాముల బంగారానికి సరైన పత్రాలు లేవని తేలింది. దీంతో రూ.50వేలు జరిమానా విధించినట్లు తెలిసింది. అనంతరం బంగారం, వజ్రాలు సంబంధించిన వారికి అప్పగించారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి : యూటీఎఫ్



డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప ఎర్రముక్కపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ చేపడు తున్న పాఠశాలల పునఃవ్యవస్థీకరణ ప్రక్రియతోపాటు ఏ విధమైన స్పష్టమైన జీఓలు లేకుండానే రోజుకో ఆలోచనతో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అందరిలో తీవ్ర ఆందోళన కలిగిస్తుందని.. తక్షణం ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం యూటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపుమేరకు డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడును కలిసి ధర్నాకు సంబంధించిన నోటీసు అందేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వారం వారం గుర్తింపు ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహిస్తున్న సమావేశాలలో సమ స్యలు ప్రభుత్వం దృష్టికి తెచ్చినప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఉపాధ్యాయుల్లో చెలరేగుతున్న ఆందోళన నేపథ్యంలో పాఠశాలల పునఃవ్యవస్థీకరణకు సంబంధించిన ఈఓ 117 రద్దు చేసి.. దాని స్థానే కొత్త జీఓ విడుదల చేసి దాని ఆధారంగా మాత్రమే పాఠశాలలను పునఃవ్య వస్థీకరించాలని కోరారు. మున్సిపల్ పాఠశాలల్లో అప్‌గ్రేడేషన్ ప్రక్రియ సత్వరమే చేపట్టి ప్రమోషన్లను ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో మే 12న డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా, 16న రాష్ట్రస్థాయిలో విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, ఏజాస్ అహ్మద్, కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, రామకేశవ తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై చెన్నకేశవుడు



సింహవాహనంపై ఊరేగుతున్న చెన్నకేశవుడు

రాజుపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి సింహవాహనంపై శనివారం సాయంత్రం భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణలతో ఈ వేడుక అత్యంత వైభవంగా సాగింది. సింహవా హనంపై సతీసమేతంగా బయల్దేరిన స్వామివారు ఉత్సవం మాఢవీధుల్లో కొనసాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం పల్లకీసేవ, రాత్రి సింహ వాహన సేవ నిర్వహించారు.

గండి ఆలయాన్ని వెంటనే ప్రారంభించాలి



గండి క్షేత్రంలో ఆగిపోయిన ఆలయ పునఃనిర్మాణ పనులను పరిశీలిస్తున్న తులసిరెడ్డి

చక్రాయపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో చేపట్టిన ఆలయ పునఃనిర్మాణ పనులపై అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు పులివెందుల ఎమ్మెల్యే దృష్టిసారించకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డిలు అన్నారు. శనివారం వారు గండి ఆలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ గండి పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు మూల విరాట్లు తప్ప మిగతా నిర్మా ణాలన్నిటిని పునఃనిర్మించాలని ప్రభుత్వం రూ.28 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఐదేళ్లయినా ప్రారంభం కాలేదన్నారు. మూల విరాట్టుకు కాకుండా బాలాలయంలోనే పూజలు జరుగుతు న్నాయ న్నారు. ఈ ఆలయం పునఃనిర్మాణ పనులు మొదలు పెట్టాక ప్రారంభమైన కాణిపాకం, అయోధ్య దేవాలయాలు ప్రారంభమయ్యాయన్నారు. కానీ గండి వీరాంజనేయస్వామి ఆల యం మూల విరాట్‌కు పూజలు పునఃప్రారంభం కాలేదన్నారు. మిగిలిన అరకొర పనులు పూర్తిచేసి జూలై 15లోగా ఉత్తరాయణ పుణ్యకాలంలోనే పునః ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, ఈఓ వెంకటసు బ్బయ్య, అర్చక స్వాములు కేసరి, రాజారమేష్, వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, వేముల మండలశాఖ అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పి.బొమ్మేపల్లిలో ఘర్షణ

జమ్మలమడుగు మే 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పూర్యపు బొమ్మేపల్లెలో శనివారం సాయంత్రం ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడటంతో 13 మందికి గాయాలైనట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. ఇంటి ముందు పేడ చల్లే విషయంలో మహిళల మధ్య మాటామాటా పెరిగి వివాదానికి దారితీసింది. జరిగిన విషయాన్ని మహిళలు తమ ఇంటి యజమానులకు తెలియజేయడంతో ఒక్కసారిగా ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. దీంతో ఒక వర్గానికి చెందిన రాజ చౌడప్ప, పెద్ద చౌడప్ప, రమణమ్మ, పెద్ద చౌడమ్మ, రామచౌడయ్య, సుహాసిని, మరో వర్గానికి చెందిన నాగంజి మునేష్, నాగేంద్ర, రమాదేవి, గురులక్ష్మి, నడిపి సుబ్బ రాయుడులు గాయపడ్డారు. అందులో తీవ్రంగా గాయపడిన నాగంజి నడిపి సుబ్బరాయుడు, రాజ, చౌడయ్యను మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు బస్సు కింద పడి యువకుడి మృతి



మృతి చెందిన అనకర్ల ప్రవీణ్ (ఫైల్)

బద్వేలు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్త చెరువు గ్రామానికి చెందిన అనకర్ల ప్రవీణ్ (37) అనే వ్యక్తి జద్వర్ల సమీపంలో ప్రమాదవశాత్తు బస్సు కింద పడి మృతి చెందాడు. వివ రాల్లోకి వెళితే.. కొత్తచెరువు గ్రామా నికి చెందిన ప్రవీణ్ శివదర్శిని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. బద్వేలు నుంచి హైదరాబాదుకు నడిపే ఈ బస్సు శుక్రవారం రాత్రి బద్వేలు నుంచి బయల్దేరి వెళ్లింది. జద్వర్ల సమీపంలోకి రాగానే బస్సు బ్రేకులు సరిగా పడడం లేదని డ్రైవరు చెప్పడంతో బస్సు కిందకు వెళ్లి ప్రవీ ణ్ పరిశీలిస్తున్న క్రమంలో డ్రైవరు బస్సును ముందుకు కదల్చడంతో టైర్లకింద పడి దుర్మరణం పాలయ్యాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బస్సు హెల్పరుగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించు కుంటున్న ప్రవీణ్ మృతితో కుటుంబం వీధినపడ్డట్లయింది. మృత దేహం ఇంకా గ్రామానికి చేరలేదు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన ఓబులరెడ్డి అలియాస్ గిరి

ప్రొద్దుటూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి తన సొంత ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శనివారం ప్రొద్దుటూరు సాయి కుటీర్ రోడ్డులో వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు... సాయికుటీర్ రోడ్డులో మృతి చెందిన వ్యక్తి ఇంటి నుంచి పెద్ద ఎత్తున దుర్వాసన వస్తుండటంతో స్థాని కు లు ఇంటి తలుపులు తట్టి చూశారు. కానీ ఎంతకూ తలుపు తెరవక పోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఇంటి తలుపులు బద్దలు కొట్టి తెరిచారు. ఇంట్లో మార్తల ఓబులరెడ్డి అలియాస్ గిరి (43) అనే వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. ఓబులరెడ్డికి 2005లో వివా హమైంది. మద్యానికి బానిస కావడంతో ఏడు సంవత్సరాల క్రితం భార్య విడాకులు ఇచ్చింది. అప్పటి నుంచి ఓబులరెడ్డి ఇంట్లో ఒంట రిగా జీవిస్తున్నాడు. ఓబులరెడ్డి తల్లి క్యాన్సర్‌తో బాధపడుతుండగా అతని చెల్లెలు కర్నూలులో చికిత్స చేపిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఓబులరెడ్డి అనుమానాస్పదస్థితిలో మృతి చెందగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అంకురార్పణతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



అంకురార్పణ సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జమ్మలమడుగు మే 10 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని నారాపురం వేంక టేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీదేవీ భూదేవి సమేత నారాపురం వెంకటేశ్వరస్వామికి ఆనవాయితీగా జమ్మలమడుగు పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, మాజీ చైర్‌పర్సన్ టి.తులసి తొలిపూజ నిర్వహించారు. కాగా, బ్రహ్మోత్సవాలలో భాగంగా 11న ఉదయం ధ్వజరోహణం, సాయంత్రం ఉంజల్‌సేవ, అన్నమాచార్య కీర్తనలు రాత్రి పెద్ద శేషవాహనం, 12న చిన్నశేషవాహనం, 13న ముత్యపు పందిరి వాహనం, 14న కల్ప వృక్షవాహనం, 15న మోహినీ అలంకారం, 16 సర్వభూపాల వాహనం, 17న రథోత్సవ కార్యక్రమం, 18న సూర్యప్రభ వాహనం, 19న చక్రస్నానం, 20న పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ప్రత్యేక ఏర్పాట్లు : బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండు రోజులు కిందట ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి పటిష్ట ఏర్పాట్లు జరిగేలా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆలయం ఎదురుగా అలం కరణ మండపం ఏర్పాటు చేశారు. ప్రత్యేక చలువ పందిర్లు వేశారు. ఆలయ ముఖద్వారం ఎదురుగా పార్కులో కూటమినేత గోణ పురుషోత్తంరెడ్డి భక్తులకు సౌకర్యం కోసం అరుగులు కట్టించారు.

సర్వభూపాల వాహనంపై శ్రీనివాసుడు



మదనపల్లె అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజు శనివారం నీరుగుట వారిపల్లె వాసులు స్వామిని సర్వభూపాల వాహనంపై ఊరేగించారు. ఆలయంలో ఉదయం స్వామికి అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో రమణ, గంగారపు భాస్కర్‌రెడ్డి, బింగి నాగేంద్ర, బింగి పాండు పాల్గొన్నారు.

నరసింహస్వామికి పూజలు

గుర్రంకొండ, మే 10(ఆంధ్రజ్యోతి):తరిగొండ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం ఉదయం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి వారికి అభిషేకాలు చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. నరసింహ స్వామి జయంతిని ఆదివారం టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఇందు లో భాగంగా స్నపన తిరుమంజనం, తరిగొండ వెం గమాంబకు పుష్పాంజలి, అనంతరం స్వామి వారి క ల్యాణం నిర్వహించనున్నట్లు ఈవో కృష్ణమూర్తి తెలిపారు.

కోదండరామాలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నిమ్మనపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారంలో శనివారం కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, హనుమంత వాహనంపై ఊరేగించారు. 11వ తేదీ ఉదయం అభిషేకం, మోహిని ఉత్సవం, 12న గరుడ సేవ, సీతారాముల కల్యాణోత్సవం, 13న పూల రథోత్సవం, 14 ఉదయం అభిషే కం, అశ్వవాహనంపై ఊరేగింపు, 15న శేష వాహ నం, తోట ఉత్సవం, 16న ఉయ్యాల ఉత్సవం నిర్వహిస్తారు.

అమరవీరుడికి కొవ్వొత్తులతో ఘన నివాళి

పెద్దతిప్పసముద్రం మే 10 (ఆంధ్రజ్యోతి) :దేశం కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుడు మురళినాయక్‌కు ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున కొవ్వొతులతో నివాళులర్పించారు. స్థానిక బస్టాండు కూడలిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మురళినాయక్ అమర్ రహే అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆయన వీరమరణం మనందరికి గర్వకారణం అన్నారు. అమరవీరుల త్యాగాలు గుర్తించి పాక్‌ను ప్రపంచ చిత్రపటంలో లేకుండా చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు చిన్నా, స్కూల్ కమిటీ చైర్మన్ రాము, సిమెంట్ శీన, కార్యం శంకర, కొట్టి రాజేంద్ర ప్రసాద్, కిరణ్‌కుమార్, బాస్ నాయకుడు రామప్ప, పాపన్న, బాబూజీ, సుబ్రమణ్యం, సప్పి రాజు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.



మురళినాయక్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

మదనపల్లెలో శత్రు సంహార హోమం

మదనపల్లె అర్బన్, మే10(ఆంధ్రజ్యోతి): భారత సైన్యంలో మనోధైర్యం నింపడానికి మదనపల్లె పట్టణం, సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో శనివారం వేద పండితుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బీజేపీ నాయకుడు బండి ఆనంద్ శత్రుసంహార హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నేత రాందాస్ చౌదరి, బండి ఆనంద్ మాట్లాడుతూ మన మందరం కలిసి సైన్యానికి మనోధైర్యం కల్పించాలన్నారు. భారతప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం పాకిస్తాన్‌కు బుద్ధి చెబుతోందన్నారు. కార్యక్రమంలో వరదారెడ్డి నారదరెడ్డి, కిరణ్, జర్మనీరాజు, సనా, జంగాల శివరాం, మదనపల్లె డివిజన్ మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు, సురేష్, రాంమోహన్, కృష్ణవేణి, పద్మావతి, పూల నాగరాజు, భవానీప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

వాల్మీకిపురం: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని, అలాగే భారత సైన్యానికి ఆ భగవంతుడు మరింత ఆత్మస్థైర్యం ఇవ్వాలని వాల్మీకిపురం పట్టణంలోని ఆలయాలో శనివారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని నల్లవీరగంగాభవానీ ఆలయం, కోనేటివీధిలోని లక్ష్మీకామేశ్వరస్వామి దేవాలయాలలో ఉదయం అభిషేకాలు, హోమాలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం జాతీయ జెండాలు చేతబట్టి భారత్ మాతాకి జై నినాదాలతో హోరెత్తించారు. స్థానిక బైపాస్ రోడ్డులోని చౌడేశ్వరిదేవి ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ, అన్నదానం చేశారు. యుద్ధంలో వీర మరణం పొందిన సైనికులకు తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నల్లవీగంగాభవాని ఆలయ ధర్మకర్త మొర్రంరెడ్డి రాంకుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఆనందశెట్టి, బీజేపీ మండల నాయకుడు విష్ణుచైతన్య, మార్కెట్ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, రమేష్, రమణారెడ్డి, బొక్కసం బ్రదర్స్, టమోటా రామచంద్ర, ఆదినారాయణ, శేఖర, సాయిభార్గవ్, సాంబ, అర్చకులు, పాల్గొన్నారు.



శత్రుసంహార హోమం చేస్తున్న బీజేపీ నాయకులు



వాల్మీకిపురం: వృద్ధులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

'టీడీపీ కార్యకర్తల జోలికొస్తే సహించం'

తంబళ్లపల్లె, మే 10(ఆంధ్రజ్యోతి): తమ పార్టీ కార్యకర్తలు, వారి కుటుంబసభ్యుల జోలికొస్తే సహించేది లేదని తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి హెచ్చరించారు. ఈ నెల 1న తంబళ్లపల్లెలో అల్లరి మూకల దాడిలో గాయపడ్డ ఎర్రమద్దువారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త కృష్ణమూర్తి కుమారుడు గణేశ్‌ను శనివారం ఆయన పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితినిఅడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు సరిగ్గా స్పందించలేదని గణేశ్ తెలుప గా, వెంటనే మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ఫోన్ చేసి విషయాన్ని తెలిపారు. అనంతరం జయచంద్రారెడ్డి మాట్లాడుతూ. అల్లరి మూకలను వదిలిపెట్టేది లేదన్నారు. ఇక మీదట తమ పార్టీ కార్యకర్తల జోలికొస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి బేరిశీన, పార్లమెంటు బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, ఆదిరెడ్డి, తరుగు శివారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రామచంద్ర, సుధాకర్, శివరాం, మాజీ ఉపసర్పంచ్ మణి, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రామాంజులు, తదితరులు పాల్గొన్నారు.



గణేశ్‌ను పరామర్శిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'తల్లికి వందనం'

వాల్మీకిపురం, మే 10(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు తెలిపారు. శనివారం మండల వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలలో తల్లికి వందనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో తల్లులకు పాదపూజ చేయించి ఆశీర్వచనాలు అందుకునేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం పౌష్టికాహార ఆవశ్యకత, పిల్లల ఆరోగ్యం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

పీలేరు కవులకు ఘనసత్కారం

పీలేరు, మే 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కవులు జలకనూరి మురళీధర్ రాజు, సరస్వతీ శ్రీరాములు రాజు, విశ్రాంత తహసీల్దారు వెంకట శేషయ్యకు తిరుపతిలో ఘనసత్కారం లభించింది. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ సెనేట్ హాలులో శుక్రవారం 'ప్రజా కళా వేదిక', డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'మన పల్లె జానపద జాతర' అనే కార్యక్రమంలో జానపద గేయాలు ఆలపించినందుకు వీరికి సత్కారం లభించింది. సీనియర్ పాత్రికేయుడు, ప్రముఖ కవి అరవ జయపాల్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారిని శాలువ, ప్రశంసా పత్రం, జ్ఞాపికలతో సత్కరించారు.



సత్కారం అందుకున్న పీలేరు కవులు

నేటి నుంచి ప్రసన్న చెన్నకేశవాలయ బ్రహ్మోత్సవాలు

నిమ్మనపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రసన్న చెన్నకేశవాలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా మండలంలోని ముష్టూరు పంచాయతీలో ఆదివారం నుంచి శుక్రవారం వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ నెల 14న కల్యాణోత్సవము, గరుడ సేవ, 15న రథోత్సవం నిర్వహిస్తామన్నారు.

శని మహాత్ముడికి తైలాభిషేకం

వాల్మీకిపురం, మే 10(ఆంధ్రజ్యోతి): శని త్రయోదశి సందర్భంగా పట్టణ పొలిమేరల్లోని ధర్మపథంలో శనేశ్వరస్వామికి శనివారం మహాతైలాభిషేకం నిర్వ హించారు. షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఏకవీర రుద్రాభిషేకం, హరిద్ర కుంకుమ, చందన, క్షీరాభిషేకం, మహాతైలా భిషేకం నిర్వహించారు. అనంతరం శని మహాకాల మృత్యుంజయ హోమం, శాంతి హోమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో కదిరి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు పార్థసారథి, ఆలయ ట్రస్టు వ్యవస్థాపకుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



పూజలందుకున్న శనీశ్వరుడు

నిత్యావసరాలు అందజేత

మదనపల్లె అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి):స్థానిక దేవతానగర్‌లోని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థకు జయమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త రామయ్య శనివారం రూ. 15 వేలు విలువచేసే నిత్యావసరాలు అందజేశారని ఆ సంస్థ ఫౌండర్ ఎంపీ ఆనందనన్ తెలిపారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ ప్రతి ఏడాది సంసకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం దాతను సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ సెక్రటరీ కవితారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్లకు మరమ్మతులు

వాల్మీకిపురం, మే 10(ఆంధ్రజ్యోతి): వేసవి, వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ట్రాన్స్‌కో అధికారులు ముందస్తు చర్యలు ప్రారంభించారు. ఎ విద్యుత్ లైన్లపై కొమ్మల తొలగింపు, సబ్‌స్టేషన్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించారు. ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్, సబ్ ఇంజనీర్ జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

నేడు అంగళ్లులో వైద్యశిబిరం

కురబలకోట, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు జడ్పీహైస్కూల్‌లో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం ఆర్గనైజర్ శెట్టి సీతారాం తెలిపారు. బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యసిబ్బందితో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు నిర్వహించే శిబిరంలో క్యాన్సర్, గుండె, బీపీ, షుగర్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరాలజీ వ్యాధులకు సంబంధించిన వైద్యులు పాల్గొంటారన్నారు.

'సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి'

మదనపల్లె అర్బన్, మే 10 (ఆంధ్రజ్యోతి):మే 20వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం ఎన్జీవోహోంలో సీఐటీయూ, వ్యవసాయం సంఘం, రైతు సంఘం, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌ల అమలుకు కేంద్రప్రభుత్వం ప్రయత్నాలను అడ్డుకోవడానికి భారతదేశ వ్యాప్తంగా మే 20న సమ్మెకు పిలుపు నిచ్చామన్నారు. కనీస వేతనం అమలు చట్టాన్ని ఉల్లంఘించే యాజమాన్యాలపై శిక్షలను తొలగించి, కార్మికులపై క్రిమినల్ చర్యలు తీసుకునేలా చట్టాలను మార్చడాన్ని కార్పొరేట్ పెట్టుబడిదారుల లాభాల కోసమేనని విమర్శించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజేశ్వరి నాయకులు మధురవాణి, కృష్ణమూర్తి, ఐద్వా నాయకురాలు భాగ్యమ్మమాట్లాడుతూ లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలన్నారు. ఉద్యోగుల పెన్షన్ పథకం కింద ప్రతి నెలా 9 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, రాజు, కృష్ణప్ప, శంకర నాయక్, గౌరీ, ప్రమీల, సుగుణ, ప్రభావతి, విజయ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసులు

మాలమహానాడు నేత పీవీ రావుకు నివాళి

మదనపల్లె అర్బన్, మే10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ వర్గాల రాజ్యాంగం హక్కుల పరిరక్షణకోసం పోరాడిన మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పివి రావు జయంతి సందర్భంగా స్థానిక మాలమహానాడు కార్యాలయంలో డీఎస్ఎస్ అధ్యక్షుడు చిన్నప్ప, మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు ఉపాధ్యక్షుడు గుండా మనోహర్, అధికార ప్రతినిధి మల్లెల మోహన, చంద్రయ్య, వీరనాల మాణిక్యం, రమణ, మెహన్, అప్పయ్య, గంగాధర్, సురేంద్ర, బెల్లం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

పాఠశాలకు బీరువాల అందజేత

పీలేరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1978-79 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు రూ. 25 వేలు విలువ గల రెండు బీరు వాలను పాఠశాల హెచ్ఎం వీ. నటరాజకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలపై మమకారంతో 45 ఏళ్ల అనంతరం పాతిక వేలు విలువగల బీరువాలు ఇవ్వడం అభినం దనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసగుప్త, శ్రీనివాసులు, రమేష్‌రెడ్డి, ముచ్చెర్ల శ్రీని వాసులు, దేవేంద్రరెడ్డి, దామోదర్‌రెడ్డి, మధుసూదనరెడ్డి, రవిచంద్ర, సురేంద్ర రావు, చెంగల్‌రాయుడు తదితరులు పాల్గొన్నారు.



బీరువాలను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

పీలేరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు లిటిల్ ఫ్లవర్ శ్రీనివాసులు అలియాస్ రాచపల్లె శీనును ఆయన మిత్రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో విద్యార్థుల జీవితాలలో అక్షర జ్యోతులు వెలిగించి వారి ఉన్నతికి రాచబాట వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం చెంగల్ రాయుడు, ఎస్‌టీవో రమేష్ రెడ్డి, కోడివాసు, గిరిధర్, మల్లికార్జున, ఉత్తమరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శ్రీరాములు, ప్రభాకర్, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకుంటున్న రాచపల్లె శ్రీనివాసులు

దివ్యాంగులకు డాక్టరేట్

పీలేరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మీ సేవ కేంద్రం నడుపుతూ పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఇద్దరు దివ్యాంగులకు బెంగుళూరుకు చెందిన భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ డాక్టరేట్ ప్రదానం చేసింది. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో చలపతి, వెంకట్రమణ మీ సేవ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇద్దరూ ప్రాణ స్నేహితులు. కనీసం లేచి నిలుచుకోలేని పరిస్థితి. దశాబ్ద కాలంగా వీరు పట్టణంలోని పేద విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు. దివ్యాంగులకు పెన్షన్లు, ఇళ్లు, ఇంటి స్థలాలు, ట్రై సైకిళ్లు, స్కూటర్లు ఇప్పించడంలో శక్తి వంచన లేకుండా కృషి చేశారు. వీరి సేవలను గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేశారు.

కురబలకోట: మండలంలోని ముదివేడుకు చెందిన టీడీపీ నేత రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.





డాక్టరేట్ అందుకుంటున్న దివ్యాంగులు వెంకట్రమణ, చలపతి

వాహనదారులు నిబంధనలను పాటించాలి

గుర్రంకొండ, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రజలు, వాహనదారులు పోలీసుల నిబంధనలను పాటించాలని ఎస్ఐ మధురామచంద్రుడు అన్నారు. శనివారం ఆటో డ్రైవర్లు, ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదన్నారు. డ్రైవర్లు వాహనాలకు సంబంధించి అన్ని రికార్డులను కలిగి ఉండాలని తెలిపారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఆటోలను అతివేగంగా నడిపి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలను తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కలకడ :ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని కలకడ సీఐ గురునాథ్ అన్నారు. శనివారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను ధరించడంతో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణనష్టం ఉండదన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇవ్వరాదన్నారు. కార్యక్ర మంలో ఎస్ఐ రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లు, ప్రజలకు సూచనలిస్తున్న ఎస్ఐ మధురామచంద్రుడు

ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం

మదనపల్లె అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి):అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న అని జిల్లా వైద్యశాలల సమన్వయ మాజీ అధికారి డాక్టర్ పూల వెంకటరమణ అన్నారు. తన తండ్రి పూల గంగులప్ప 14వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, వారి కుటుంబ సభ్యులకు, సిబ్బందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించేవారి సంఖ్య తగ్గిపోతోందన్నారు. మానవ తా విలువలు అడుగంటుతున్నాయని, ఒక్కరిపై ఒక్కరు పంతాలు, పట్టింపులు, ద్వేషాలతో జీవితాలను సందర్భంగా మార్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తండ్రి వర్ధంతి సందర్భంగా అన్నదానం చేయడం తనకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూల కల్పన, పూల బిందస్‌తేజ్, బిపిన్‌తేజ్, ఇండస్ట్రియల్ అధికారి పూల దేవర శంకరప్ప, పూల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న మాజీ డీసీహెచ్ఎస్ డాక్టర్ పూల వెంకటరమణ

నేటి నుంచి నల్లవీర గంగాభవాని జాతర

వాల్మీకిపురం, మే 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఉన్న నల్లవీర గంగా భవాని అమ్మవారి ఆలయం జాతరకు ముస్తాబైంది. ఆదివారం ఉదయం చాటింపుతో వేడుకలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ధర్మకర్త మొర్రంరెడ్డి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, ప్రత్యేకాలంకరణలతో పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. అనంతరం మంగళవాయిద్యాల నడుమ మహిళలు కలశాలతో ప్రదర్శనగా వెళ్లి గంగరాళ్లకు జలాభిషేకం, పూజలు నిర్వహించనున్నారు. వారం రోజుల పాటు సాగే ఈ ఉత్సవాలలో ఈనెల 16వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాలు భక్తులను అలరించనున్నాయి. 17న శనివారం పాలపొంగు దేవర, 18న ఆదివారం అమ్మవారికి దీలు బోనాలు సమర్పిస్తారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.



జాతరకు ముస్తాబైన నల్లవీరగంగాభవాని దేవాలయం